తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

జనంసాక్షి

www.janamsakshi.org

కరీంనగర్ - నిజామాబాద్

రాజన్న సిరిసిల్ల | కామారెడ్డి

పెద్దపల్లి | జగిత్యాల


గురువారం

05 నవంబర్ 2026

పేజీలు : 8

Follow :

యువత చేతిలో సెల్‌ఫోన్.. మెదడులో మత్తు.. ప్రవర్తనలో నేరప్రవృత్తి!



చట్టమంటే భయం లేదు.. గురువంటే గౌరవం లేదు.. తల్లిదండ్రుల మాటంటే లెక్కలేదు! సినిమాల మోజు కొంత.. సామాజిక మాధ్యమాల పిచ్చి ఎక్కువ.. బెల్టు దుకాణాల మధ్యం మరో శాపం! చిన్న వయసులోనే నేరాల బాట.. ఆవేశంలో జీవితాలను బలి చేసుకుంటున్న యువత.. ఇప్పటికైనా మేల్కొనాల్సిన ప్రభుత్వాలు, సమాజం

బాన్సువాడ నవంబర్ 4 (జనంసాక్షి)

నేటి యువతలో కొందరి ప్రవర్తన చూస్తుంటే రేపటి సమాజం ఎలా ఉండబోతుందోనన్న ఆందోళన కలుగుతోంది. చేతిలో ఖరీదైన సెల్‌ఫోన్ ఉంది.. నిమిషాల్లో ప్రపంచాన్ని చూసే అవకాశం ఉంది.. కానీ ఏది మంచి? ఏది చెడు? అనే విచక్షణ మాత్రం కొందరిలో కొరవడుతోంది. చట్టాన్ని లెక్కచేయడం లేదు.. గురువుల మాట వినడం లేదు.. తల్లిదండ్రుల హెచ్చరికలను పట్టించుకోవడం లేదు. చిన్న చిన్న విషయాలకే ఆవేశానికి లోనవుతూ గొడవలు, దాడులు, చివరకు నేరాల వరకు వెళ్తున్నారు. బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాల్సిన వయసులో తమ జీవితాలనే ప్రమాదంలోకి నెట్టుకుంటున్నారు.

ఒక్కక్షణం వైరల్ కావాలనే పిచ్చి.. జీవితాంతం వెంటాడే కేసులు!

సినిమాల్లో చూపించే పోరాటాలు, హింసాత్మక సన్నివేశాలను అనుకరించడం కొందరు యువతలో కనిపిస్తోంది. అయితే సినిమాలకంటే సామాజిక మాధ్యమాల ప్రభావమే ఎక్కువగా మారుతోంది. యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ తదితర వేదికల్లో వచ్చే ప్రతి విషయాన్ని అనుకరించాలనే తపన పెరుగుతోంది. నాలుగు మంచి మాటలు చెప్పి గుర్తింపు తెచ్చుకోవడం కంటే, వివాదాస్పదంగా ప్రవర్తించి ఒక్కసారిగా ప్రసిద్ధి పొందాలనే ఆలోచనలు కొందరిలో పెరుగుతున్నాయి. సామాజిక మాధ్యమాల్లో వచ్చే తప్పుడు పోకడలు నిజజీవితంలో అనుసరిస్తూ సమస్యలను కొని తెచ్చుకుంటున్నారు.

మద్యం మత్తులో మానవత్వం మరిచిపోతున్నారా?

యువత భవిష్యత్తును దెబ్బతీస్తున్న మరో ప్రధాన సమస్య మద్యం. గ్రామాల్లో విచ్చలవిడిగా కొనసాగుతున్న బెల్టు దుకాణాలు, అందుబాటులోకి వస్తున్న మద్యం యువతను వ్యసనాల వైపు నడిపిస్తున్నాయనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. మద్యం మత్తులో విచక్షణ కోల్పోయి చిన్నపాటి గొడవలకే కత్తులు, దాడులు, బెదిరింపులకు దిగుతున్న ఘటనలు సమాజంలో కలవరపెడుతున్నాయి. క్షణికావేశంలో చేసే తప్పు ఒక కేసుతో ఆగిపోకుండా కుటుంబ పరువు, ఉపాధి, భవిష్యత్తుపై ప్రభావం చూపుతోంది.

పాఠశాలలే సురక్షితం కాకపోతే విద్యార్థుల పరిస్థితి ఏమిటి?

అనంతపురం జిల్లా రాప్తాడు ఉన్నత పాఠశాలలో శనివారం చోటుచేసుకున్న ఘటన విద్యాసంస్థల భద్రతపై తీవ్రంగా ఆలోచించాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తోంది. ఇలాంటి ఘటనలను ఒక్క ప్రాంతానికే పరిమితమైనవిగా భావించకూడదు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రహరీ గోడలు లేకపోవడం, భద్రతా పర్యవేక్షణ లోపించడం వల్ల బయటి వ్యక్తులు పాఠశాలల్లోకి ప్రవేశించే అవకాశాలు ఉంటున్నాయి. కొన్ని చోట్ల పాఠశాల ప్రాంగణాలు అసాంఘిక కార్యకలాపాలకు వేదికలవుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. విద్యార్థులకు భద్రత కల్పించాల్సిన పాఠశాలల్లోనే ఇలాంటి పరిస్థితులు ఉంటే బాధ్యత ఎవరిది? విద్యాశాఖ అధికారులు ఇప్పటికైనా స్పందించాల్సిన అవసరం ఉంది.

చట్టం తెలియక కాదు.. శిక్ష గురించి భయం లేక!

నేటి యువతకు చట్టాలపై సరైన అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. చిన్న తప్పు కూడా పెద్ద నేరంగా మారవచ్చనే విషయాన్ని విద్యార్థి దశ నుంచే వివరించాలి. పోలీసు కేసు నమోదైతే ఎదురయ్యే పరిణామాలు, న్యాయస్థానాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు, చదువు, ఉద్యోగం, భవిష్యత్తుపై పడే ప్రభావాలను ఉదాహరణలతో తెలియజేయాలి.

ప్రతి పాఠశాలలో నెలకు కనీసం ఒకసారి పోలీసు అధికారులు, న్యాయ నిపుణులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. గ్రామాల్లోనూ యువత కోసం ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి చట్టాలపై అవగాహన కల్పించాలి. నేరం చేసిన తర్వాత శిక్షించడం కంటే నేరం చేయకుండా ముందే చైతన్యపరచడం ముఖ్యం.

పిల్లలపై తల్లిదండ్రుల నిఘా.. గురువులకు గౌరవం కల్పించాలి!

పిల్లలు ఎవరితో తిరుగుతున్నారు? ఏం చూస్తున్నారు? ఎలాంటి అలవాట్లకు లోనవుతున్నారు? అనే విషయాలను తల్లిదండ్రులు నిరంతరం గమనించాలి. పిల్లలు తప్పు చేసినప్పుడు సమర్థించడం కాకుండా, తప్పును తప్పుగా గుర్తించి సరిదిద్దాలి. అదే విధంగా ఉపాధ్యాయులు విద్యార్థులను మందలించినా, క్రమశిక్షణ నేర్పించినా తల్లిదండ్రులు ఉపాధ్యాయులకు అండగా నిలవాలి. గురువుల పట్ల గౌరవం, పెద్దల పట్ల మర్యాద, సమాజం పట్ల బాధ్యత చిన్ననాటి నుంచే నేర్పించాలి.

యువతను మార్గదర్శకపోతే సమాజానికి తప్పదు భారీ మూల్యం!

యువత చేతిలో ఉండాల్సింది మద్యం సీసా కాదు.. మంచి పుస్తకం. వారి ఆలోచనల్లో ఉండాల్సింది పగ, ప్రతీకారం కాదు.. లక్ష్యం, క్రమశిక్షణ. సామాజిక మాధ్యమాల్లో అనవసరమైన గుర్తింపు కోసం జీవితాలను పణంగా పెట్టడం కాదు.. సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా ఎదగడం ముఖ్యం.ప్రభుత్వాలు బెల్టు దుకాణాలపై కఠిన నిఘా పెట్టాలి. పాఠశాలల్లో భద్రతను పెంచాలి. పోలీసు శాఖ యువతకు చట్టాలపై అవగాహన కల్పించాలి. విద్యాశాఖ విలువలతో కూడిన విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలి. తల్లిదండ్రులు పిల్లలపై బాధ్యతాయుతమైన పర్యవేక్షణ కొనసాగించాలి.

ఒక్క యువకుడు తప్పుదారి పడితే ఒక కుటుంబం కన్నీరు పెడుతుంది.. ఒక తరం తప్పుదారి పడితే సమాజమే మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. అందుకే యువతను శిక్షించడం ఒక్కటే పరిష్కారం కాదు.. వారు తప్పుదారి పట్టకుండా తీర్చిదిద్దడమే అసలైన పరిష్కారం. ప్రభుత్వాలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం ఇప్పటికైనా కళ్లు తెరవాలి!

విద్యార్థుల విజయాలు.. ఉపాధ్యాయుడికి జాతీయ గుర్తింపు

పారమిత మ్యూజిక్ బ్యాండ్ విద్యార్థులను , జాతీయ స్థాయి ఇన్నోవేటివ్ టీచర్ అవార్డు గ్రహీత లలిత్ మోహన్ సాహులను

అభినందించిన విశ్రాంత ప్రధాన ఎన్నికల కమిషనర్ సి. పార్థసారథి

కరీంనగర్ బ్యూరో, నవంబర్ 04 (జనంసాక్షి) :

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అరుదైన విజయాలు సాధించి కరీంనగర్ జిల్లాకు, తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచిన పారమిత హెరిటేజ్ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయుడు లలిత్ మోహన్ సాహును బుధవారం రోజు కరీంనగర్‌లోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో విశ్రాంత ప్రధాన ఎన్నికల కమిషనర్ సి. పార్థసారథి, ఆర్డీఓ షర్మిల, జిల్లా విద్యాశాఖ అధికారి తిరుపతిరావు ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్ ఐటీఎం యూనివర్సిటీలో అక్టోబర్ 23 నుంచి 28 వరకు నిర్వహించిన 21వ అంతర్జాతీయ సాంస్కృతిక ఉత్సవం ‘ఉద్భవ్ ఉత్సవ్ -2026’ లో పారమిత హెరిటేజ్ పాఠశాల మ్యూజిక్ బ్యాండ్ బృందం అద్భుత ప్రతిభ కనబరిచి గ్రూప్ మ్యూజికల్ బ్యాండ్ విభాగంలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. వివిధ దేశాలకు చెందిన సంగీత బృందాలతో పోటీపడి ఈ ఘనత సాధించడం విశేషం. అదేవిధంగా వాద్య సంగీతం సోలో విభాగంలో 8వ తరగతి విద్యార్థి కిట్ల చరణ్ ప్రథమ స్థానం, ఏవీకే క్రితిక్ ద్వితీయ స్థానం సాధించారు. మరోవైపు, పారమిత హెరిటేజ్ పాఠశాల సీనియర్ ఉపాధ్యాయుడు, ప్రాజెక్ట్స్ అండ్ ఇన్నోవేషన్ హెడ్ లలిత్ మోహన్ సాహు దేశవ్యాప్తంగా ఎంపికైన టాప్ -10 వినూత్న ఉపాధ్యాయుల్లో ఒకరిగా నిలిచారు. వివో ఇగ్నైట్ టీచర్ ఇన్నోవేషన్ ఫెలోషిప్ - 2026కు తెలంగాణ రాష్ట్రం నుంచి ఎంపికైన ఏకైక ఉపాధ్యాయుడిగా గుర్తింపు పొందారు. దేశవ్యాప్తంగా సుమారు 37 వేల దరఖాస్తుల నుంచి కఠినమైన ఎంపిక ప్రక్రియ ద్వారా ఆయన ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. న్యూఢిల్లీలోని భారత్ మండపంలో అక్టోబర్ 28న నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు ఈ ఫెలోషిప్‌ను ప్రదానం చేశారు. ఈ రెండు విజయాలు విద్యార్థుల్లోని సృజనాత్మకతకు, ఉపాధ్యాయుల అంకితభావానికి నిదర్శనమని ప్రముఖులు పేర్కొన్నారు.

సంగీత రంగంలో అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటిన విద్యార్థులను, వినూత్న బోధనా పద్ధతులతో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఉపాధ్యాయుడు లలిత్ మోహన్ సాహును ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి విద్యాసంస్థకు, జిల్లాకు మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఇ. ప్రసాదరావు మాట్లాడుతూ, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి, ఉపాధ్యాయుల్లో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి సంస్థ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు సాధించిన ఈ విజయాలు సంస్థకు ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ప్రధాన ఎన్నికల కమిషనర్ సి. పార్థసారథి, ఆర్డీఓ షర్మిల, జిల్లా విద్యాశాఖ అధికారి తిరుపతిరావు, పారమిత విద్యాసంస్థల డైరెక్టర్ వినోద్ రావు, ఉపాధ్యాయులు లలిత్ మోహన్ సాహు, జితుమణి శర్మ, కిరణ్, సాహు, విద్యార్థులు, పాల్గొన్నారు.



నిజామాబాద్‌లో దీపావళి వేళ పేకాటపై ఉక్కుపాదం

ఆడినా, ఆడించినా కఠిన చర్యలు: సీపీ సాయిచైతన్య

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 4 జనంసాక్షి:

దీపావళి పండుగను పురస్కరించుకుని నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పేకాటను పూర్తిగా నిషేధించినట్లు పోలీస్ కమిషనర్ పి. సాయిచైతన్య తెలిపారు. పండుగ సంబరాల పేరుతో చట్ట విరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు. కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్లలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. పండుగ వేళ ఎవరైనా పేకాట ఆడినా, స్థావరాలు నిర్వహించినా, ఇతరులను ప్రోత్సహించినా లేదా సహకరించినా వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. ఈ మేరకు కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల అధికారులను అప్రమత్తం చేస్తూ ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. పేకాటపై ఉక్కుపాదం మోపేందుకు ప్రత్యేక బృందాలను (స్పెషల్ టీమ్స్) రంగంలోకి దించినట్లు తెలిపారు.పోలీసులకు సమాచారం అందించండి..ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో ఎక్కడైనా పేకాట ఆడుతున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే నిజామాబాద్ పోలీస్ కంట్రోల్ రూమ్ నంబర్ 8712659700కు డయల్ చేసి సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా



ఉంచబడతాయని భరోసా కల్పించారు. ప్రజలందరూ పోలీసులతో సహకరించి, శాంతిభద్రతల పరిరక్షణకు తోడ్పడుతూ దీపావళి పండుగను ప్రశాంతంగా, ఆనందంగా జరుపుకోవాలని సీపీ పి. సాయిచైతన్య విజ్ఞప్తి చేశారు.

అనారోగ్యంతో బాధపడుతూ

ఆటో డ్రైవర్ ఆత్మహత్య

గుండెకు స్టెంట్.. ఇతర ఆరోగ్య సమస్యలతో కొంతకాలంగా ఇబ్బందులు

డిచ్‌పల్లి, నవంబర్ 4 జనంసాక్షి:



మండలంలోని దూస్గామ్ గ్రామానికి చెందిన గొల్ల రవీందర్ (39) ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందాడు. ఆటో నడుపుకుంటూ జీవనం సాగించే రవీందర్ కొంత కాలం క్రితం గుండెకు స్టెంట్ వేయించు కున్నాడు. అంతే కాక ఇతర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు డిచ్‌పల్లి ఎస్సై తెలిపారు.కుటుంబ సభ్యులు బంధువుల ఇంటికి వెళ్లి, ఇంట్లో ఎవరూ లేని సమయంలో మంగళవారం రవీందర్ ఇంట్లో ఉరివేసుకుని మృతి చెందినట్లు పోలీసులు వెల్లడించారు. మృతుడి భార్య గొల్ల శిరీష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

గెస్ట్ స్పెషల్ ఎడ్యుకేటర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం



శంకరపట్నం, నవంబర్ 4 జనం సాక్షి

శంకరపట్నం మండల కేంద్రంలోని పీఎంశ్రీ మోడల్ స్కూల్‌లో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు బోధించేందుకు గెస్ట్ స్పెషల్ నీడ్స్ ఎడ్యుకేటర్ పోస్టును భర్తీ చేయనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ కే. ప్రభాకర్ తెలిపారు. ఐదు నెలల పాటు తాత్కాలిక ప్రాతిపదికన కొనసాగే ఈ నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రాడ్యుయేషన్‌తో పాటు బీఎడ్ స్పెషల్ ఎడ్యుకేషన్ అర్హత కలిగిన అభ్యర్థులు నెలకు రూ.16,500 గౌరవ వేతనంతో పనిచేసేందుకు అర్హులని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 7వ తేదీలోగా శంకరపట్నం మోడల్ స్కూల్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

మాదిగ విద్యార్థి సమాఖ్య బలోపేతమే ధ్యేయం

ఎం ఆర్ పి ఎస్ జిల్లా ఇన్చార్జి బోడ సునీల్ మాదిగ

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 4 జనం సాక్షి:



ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో మాదిగ విద్యార్థి సమాఖ్యను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేయాలని ఎం ఆర్ పి ఎస్ రాష్ట్ర నాయకులు, ఉమ్మడి జిల్లా ఇన్చార్జి బోడ సునీల్ మాదిగ పిలుపునిచ్చారు. నిజామాబాద్ నగరంలోని ఓల్డ్ అంబేద్కర్ భవన్‌లో ఎం ఆర్ పి ఎస్, ఎం ఎస్ పి, ఎం ఎస్ ఎఫ్ ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సంయుక్త సమావేశం ఘనంగా నిర్వహించారు.ఎం ఆర్ పి ఎస్ నిజామాబాద్ జిల్లా మాజీ అధ్యక్షులు కనక ప్రమోద్ మాదిగ అధ్యక్షత వహించిన ఈ సమావేశానికి బోడ సునీల్ మాదిగ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు జిల్లా ఇంచార్జిగా బాధ్యతలు చేపట్టానని తెలిపారు. ఈ నెల 20వ తేదీలోగా ఉమ్మడి జిల్లాలోని ప్రతి మండలంలో ఎం ఎస్ ఎఫ్ కమిటీలను ఏర్పాటు చేసి, మాదిగ విద్యార్థులను చైతన్యవంతం చేయాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. విద్యార్థి శక్తితోనే భవిష్యత్తులో జరిగే రాజకీయ పోరాటాల్లో బలమైన భాగస్వామ్యం లభిస్తుందని, రాష్ట్ర రాజకీయాలను శాసించే స్థాయికి విద్యార్థులు ఎదగాలని ఆకాంక్షించారు.మొదటి స్థానంలో నిలిపేందుకు సిద్ధం: దుప్పేలి అనిల్ మాదిగ ఎం ఆర్ పి ఎస్ రాష్ట్ర నాయకులు దుప్పేలి అనిల్ మాదిగ మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మాదిగ విద్యార్థులతో కమిటీలు ఏర్పాటు చేసి, రాష్ట్రంలోనే నిజామాబాద్ జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఎం ఎస్ ఎఫ్ రాష్ట్ర నాయకులు బైరపోగు శివకుమార్ మాదిగ మాట్లాడుతూ, ప్రతి ఎం ఆర్ పి ఎస్, ఎం ఎస్ పి నాయకులు తమ సొంత గ్రామంలో ఎం ఎస్ పి గ్రామ కమిటీలను పూర్తి చేయాలని కోరారు. భవిష్యత్తులో జరగనున్న ఎం ఎస్ ఎఫ్ జిల్లా సదస్సుకు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా విచ్చేయనున్న నేపథ్యంలో, వేయి మంది మాదిగ విద్యార్థులతో ఈ సమావేశాన్ని దిగ్విజయంగా నిర్వహించే బాధ్యత మనదేనని గుర్తుచేశారు.ఈ సమావేశంలో జిల్లా ఇన్చార్జిలు దుప్పేలి అనిల్ మాదిగ, బైరపోగు శివకుమార్ మాదిగ, మాసాయిపేట యాదగిరి మాదిగ, మంథని సామెల్ మాదిగ, ఎం ఎస్ పి జిల్లా మాజీ అధ్యక్షులు సరికేల పోశెట్టి మాదిగ, బట్టు వెంకటరాములు మాదిగ, కాంతి పద్మారావు మాదిగ, గంధమాల నాగభూషణ్ మాదిగ, ఎం ఈ ఎఫ్ జాతీయ కోర్ కమిటీ సభ్యులు తెడ్డు గంగారాం మాదిగ, నాంపల్లి మాదిగ, ఎం ఎం ఎస్ జాతీయ కోర్ కమిటీ సభ్యులు యమునా మాదిగ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పద్మ మాదిగ, రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీ మాదిగ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సిద్ధపల్లి గ్రామానికి చెందిన వేల్పుల శంకర్‌కు రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు

రాజాపూర్?లద్నాపూర్ మధ్య చీకటి మూలమలుపు వద్ద డివైడర్‌ను ఢీకొన్న వాహనం



రామగిరి, నవంబర్ 4: జనం సాక్షి

మంథని మండలం సిద్ధపల్లి గ్రామానికి చెందిన వేల్పుల శంకర్ రాజాపూర్? లద్నాపూర్ గ్రామాల మధ్య రహదారిపై చీకటిగా ఉన్న మూలమలుపు వద్ద వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు.ఈ ప్రాంతంలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని పలుమార్లు వార్తల ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సికింద్రాబాద్ బస్సు రాక..

ప్రయాణికుల అవస్థలు

గన్నేరువరం, నవంబర్ 04 (జనంసాక్షి):

కరీంనగర్ డిపో నుంచి గన్నేరువరం, బెజ్జంకి, సిద్దిపేట మీదుగా సికింద్రాబాద్ వెళ్లే ఆర్టీసీ బస్సు బుధవారం రాకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బుధవారం ఉదయం నుంచి బస్సు కోసం ఆయా గ్రామాల బస్ స్టాండ్లలో గంటల తరబడి వేచి చూసిన ప్రయాణికులు చివరకు గమ్యస్థానాలకు చేరుకోవడానికి ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వచ్చింది. ఈ క్రమంలో ప్రైవేట్ డ్రైవర్లు అదనపు చార్జీలు వసూలు చేయడంతో ప్రయాణికులపై తీవ్ర ఆర్థిక భారం పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఆర్టీసీ అధికారులను వివరణ కోరగా, కండక్టర్ మరియు డ్రైవర్ సకాలంలో విధులకు హాజరుకాకపోవడం వల్లే బస్సు సర్వీసును రద్దు చేయాల్సి వచ్చిందని చెప్పడంపై ప్రయాణికులు మండిపడుతున్నారు. నిత్యం ఈ బస్సు సర్వీసు ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు రాదో తెలియక తీవ్ర అయోమయానికి గురవుతున్నామని వాపోయారు. సమయపాలన పాటించకుండా ప్రయాణికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న ఆర్టీసీ వైఖరిపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా స్థానిక రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవ తీసుకుని, గన్నేరువరం మీదుగా సికింద్రాబాద్ కు వెళ్లే ఈ బస్సు సర్వీసును క్రమం తప్పకుండా, సక్రమంగా నడిచేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మూడు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న పటేల్



కరీంనగర్ బ్యూరో, నవంబర్ 04 (జనంసాక్షి) :

టీసెర్ప్, డీఆర్డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నుస్తులాపూర్, నర్సింగపూర్, పోలంపల్లి గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ప్రారంభించారు. నుస్తులాపూర్ కొనుగోలు కేంద్రాన్ని చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న పటేల్ సంయుక్తంగా ప్రారంభించగా, నర్సింగపూర్, పోలంపల్లి కేంద్రాలను ఆకుల నరసన్న పటేల్ స్థానిక సర్పంచ్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ రైతులు ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్వింటాల్‌కు రూ. 2,461 మద్దతు ధరతో పాటు సన్నవడ్లకు అదనంగా రూ. 500 బోనస్ పొందాలని కోరారు. రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్‌లు పేరుక రవీందర్, గుంటి లావణ్య, మల్లేశం, గోగూరి అంజలి, నర్సింహారెడ్డి, నుస్తులాపూర్ పీఏసీఎస్ చైర్మన్ మోరపెల్లి రమణారెడ్డి, మండల తహసీల్దార్ టి. శ్రీనివాసరెడ్డి, బండారు రమేష్ గౌడ్, టీసెర్ప్ ఏపీఎం మట్టెల సంపత్, సీసీలు సముద్రాల చంద్రమౌళి, నాంపల్లి రవీందర్, స్థానిక రైతులు, మహిళా సంఘాల నాయకులు, వీఓఏలు పద్మ, తిరుపతి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి నిర్విరామంగా కృషి

- నాణ్యమైన విద్యుత్తు అందజేస్తాం
- కల్లి బొల్లి మాటలతో కాలయాపన చేస్తున్న బిఆర్ఎస్
- కరువు పై అవగాహన లేని మాటలు
- రైతులకు ఆరుతడి విత్తనాలు పంపిణీ చేసిన ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయ రమణారావు

సుల్తానాబాద్,నవంబర్ 04(జనంసాక్షి) : కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి నిర్విరామంగా కృషి చేస్తుందని, రాష్ట్ర ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ కార్యాలయ ఆవరణలో వ్యవసాయ శాఖ, ప్రాథమిక పరపతి సహకార సంఘం సుల్తానాబాద్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన,సబ్సిడీ ఆరుతడి విత్తనాల పంపిణీ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ముఖ్యఅతిథిగా హాజరై ఆరుతడి విత్తనాల పంపిణీ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వం కల్లి బొల్లి మాటలు చెప్పుతూ ప్రజలను మభ్యపెడుతున్నారని, అలాంటి వారి మాటలను ప్రజలు విశ్వసించవద్దని సూచించారు. రాష్ట్రంలో విద్యుత్ కొరత ఏమాత్రం లేదని, 12 గంటలు నాణ్యమైన విద్యుత్తును అందిస్తున్నామని తెలిపారు. వేసవికాలం పంటలకు ముఖ్యమంత్రితో స్వయంగా జిల్లా మంత్రి శ్రీధర్ బాబు ఎమ్మెల్యే మక్కాన్సింగ్ తో కలిసి ముఖ్యమంత్రిని ఒప్పించి పంటలకు తాగునీరు అందించామని ఎనిమిది నియోజకవర్గాలకు సాగునీరు అందించి చెరువులు కుంటలు బావులు తద్వారా భూగర్భ జలాలు పెరిగాయని తెలిపారు. రైతులు తమ ధాన్యాన్ని ఐకెపి సింగల్ విండో వ్యవసాయ మార్కెట్ ఎక్కడైనా విక్రయించుకోవచ్చని లేదా లాభాలు వస్తే మిల్లర్లకు కూడా ఇష్టం ఉన్న కాడ విక్రయించుకోవచ్చని తెలిపారు.నియోజకవర్గ వ్యాప్తంగా 24 వేల ఎకరాలలో వరి పంట పండిందని స్పష్టం చేశారు. ఎల్ ని నో ప్రభావంతో రానున్న రోజులలో వర్షాభావం తగ్గి భూగర్భ జలాలు



ఎండిపోయే ప్రమాదం ఉన్నందున రైతులు ఆరుతడి పంటలు వేయాలని సూచించారు. ప్రభుత్వం ఆరుతడి విత్తనాలను ఎస్సీ రైతులకు ఉచితంగా ఇతర రైతులకు సబ్సిడీపై అందజేస్తుందని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కరువును ప్రతిపక్షాలు రాజకీయం చేస్తున్నాయని అవగాహన తెలివి లేని దద్దమ్మలు అసత్య ప్రచారం చేస్తున్నారని నమ్మవద్దని సూచించారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా ప్రాజెక్టుల నిర్మాణం జరిగిందని, ఇప్పటికీ ప్రాజెక్టులు చెక్కుచెదరలేదని తెలిపారు. ఎస్ ఆర్ ఎస్ పి కాలువలను శ్రీమతి ఇందిరాగాంధీ హయాంలో ప్రారంభించారని,అప్పటినుండి నేటి వరకు రైతులకు సాగునీరు అందుతుందని తెలిపారు. పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బి ఆర్ ఎస్ ప్రభుత్వం ఎస్సారెస్పీ కాలువకు ఒక్క సెటర్,కూడా నిర్మాణం చేసిన దాఖలాలు లేవని తెలిపారు.కాలేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేస్తే అది కూలిపోయిందని, ప్రస్తుతం కొంతమంది నాయకులు కాలేశ్వరం ప్రాజెక్టును సందర్శించి ప్రాజెక్టు నీళ్లను ఎత్తిపోయవచ్చని అవగాహన లేని మాటలు మాట్లాడుతున్నారని ఎక్కడి నుండి ఎలా ఎత్తిపోయాలో వివరించాలని మండిపడ్డారు. అప్పటి మంత్రి హరీష్ రావు జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్టు నీరు పెద్దపల్లి జిల్లాను ముద్దాడుతాయని ప్రగల్భాలు పలికారని, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఏ నియోజకవర్గాన్ని కాలేశ్వరం నీళ్లు ముద్దాడయో నిరూపించాలని నిరూపిస్తే తాను ముక్కు నేలకు రాస్తానని సవాలు విసిరారు.కాంగ్రెస్ ప్రభుత్వం నిత్యం ప్రజల రైతుల సంక్షేమం కోసం పరితపిస్తుందని సీఎం రేవంత్ రెడ్డి రైతు పక్షపాతిగా నిలుస్తున్నారని తెలిపారు. కేంద్రం అందిస్తున్న యూరియా విత్తనాలు రాష్ట్ర ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం లేదని అవగాహన లేకుండా రాష్ట్ర ప్రభుత్వంపై నిందలు వేస్తున్నారని ప్రజలు నమ్మవద్దని సూచించారు. అనంతరం రైతులకు సబ్సిడీపై అందజేసిన ఆరుతడి విత్తనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్ మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ మార్కెట్ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, కృషి విజ్ఞాన శాస్త్రవేత్త సంపత్, మండల వ్యవసాయ అధికారిని పైడితల్లి, తోపాటు,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దన్నాయక్ దామోదర్ రావు, రైతు సెల్ మండల అధ్యక్షులు పన్నాల రామన్న, సింగిల్ విండో చైర్మన్ కల్లేపల్లి జానీ, చిలుక సతీష్,సంఘ సీఈవో బూర్గు సంతోష్,సర్పంచులు కాంపల్లి సతీష్ కుమార్, గుండేటి దేవేందర్, ఏరుకొండ స్రవంతి రమేష్, కర్రె గట్టయ్య, మండలంలోని సింగిల్ విండో చైర్మన్లు డైరెక్టర్లు మున్సిపల్ కౌన్సిలర్లు,ఉట్ల వర ప్రదీప్, తొర్రి కొండ ప్రభాకర్,చింతల రాజు,అమీరిశెట్టి స్రవంతి రాకేష్,రైతులు,కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ఐకెపి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయ రమణారావు



సుల్తానాబాద్,నవంబర్ 04 (జనంసాక్షి) : మండలంలోని అల్లిపూర్ గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాన్ని బుధవారం రాష్ట్ర ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ముఖ్య అతిథిగా హాజరై సర్పంచ్ కోదాటి సాయికిరణ్ తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో విజయ రమణారావు మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రాలతో పాటు అధిక లాభాలు వస్తే వరి ధాన్యం ఎక్కడైనా విక్రయించుకోవచ్చని అని ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. రైతులు కష్టపడి పండించిన పంటను కొనుగోలు కేంద్రాలను విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. గింజ కటింగ్ లేకుండా కొనుగోల్లు పారదర్శకంగా జరపాలని నిర్వాహకులకు సూచించారు.ఈ కార్యక్రమంలో అల్లిపూర్ సర్పంచ్ కోదాటి సాయికిరణ్ తో పాటు ఐకెపి ఎపిఎం కనుకయ్య, ఐకెపి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భీమన్నను దర్శించుకున్న విజిలెన్స్ ఎస్పీ

వేములవాడ (జనంసాక్షి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధాలయమైన భీమేశ్వర స్వామివారిని కరీంనగర్ విజిలెన్స్ ఎస్పీ జి.



బసవ రెడ్డి బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయానికి విచ్చేసిన ఎస్పీకి ఆలయ అర్చకులు, వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారి దర్శనానంతరం మండపంలో వేద పండితులు ఆయనకు వేదాశీర్వచనం అందజేశారు. అనంతరం ఆలయ ఈవో రమాదేవి స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి, లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పీఆర్వో పెరిక శ్రీనివాస్, ఆలయ పర్యవేక్షకులు నరేందర్, సీనియర్ అసిస్టెంట్ నక్క తిరుపతి, ఆలయ ఉద్యోగులు, వేద పండితులు పాల్గొన్నారు.

రాజన్నకు వెండి కానుకలు సమర్పించిన వరంగల్ భక్తులు

వేములవాడ, నవంబర్ 4 (జనం సాక్షి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి వరంగల్‌కు చెందిన భక్తులు తనుగుల రత్నాకర్ – అన్నపూర్ణ దంపతులు భారీ కానుకను సమర్పించారు. తమ కుమారుడు జయంత్ పేరిట సుమారు 2 కిలోల బరువు గల వెండి గంప, బిందె ప్లేట్‌ను తయారు చేయించి స్వామివారికి కానుకగా అందజేశారు. ఈ కానుకల విలువ సుమారు రూ. 5 లక్షలు ఉంటుందని ఆలయ అధికారులు తెలిపారు.



రాజన్న ఆలయ ప్రాంగణంలో ఆలయ ఈవో రమాదేవికి భక్తులు ఈ వెండి వస్తువులను స్వయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం డిప్యూటీ ఈవో ప్రతాప నవీన్ కుమార్, ఇతర ఆలయ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో పోషకాహార పంపిణీ

ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి:సర్పంచ్ కొండ రమేష్ గౌడ్

ఎల్లారెడ్డిపేట, నవంబర్ 04, (జనంసాక్షి) : ఎల్లారెడ్డిపేట మండలంలోని గొల్లపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో బుధవారం చిన్నారులకు బాలమృతం,



గర్భిణీలు, బాలింతలకు పాలు, ఇతర పోషకాహారాలను పంపిణి చేశారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ కొండ రమేష్ గౌడ్ హజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొండ రమేష్‌గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పోషకాహార పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చిన్నారుల ఆరోగ్యాభివృద్ధికి, గర్భిణీలు, బాలింతల ఆరోగ్య పరిరక్షణకు పౌష్టికాహారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో సత్తయ్య, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సూర్యకళ, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

తుఫాను బీభత్సంతో దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థ పునరుద్ధరణలో సత్యం పవర్ సిస్టమ్స్ కీలక పాత్ర

- 35 మంది సిబ్బందితో అమలాపురం ప్రాంతంలో విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టిన చైర్మన్ మిట్టపల్లి ప్రవీణ్ కుమార్

సుల్తానాబాద్,నవంబర్ 04(జనంసాక్షి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇటీవల సంభవించిన తుఫాను కారణంగా తీవ్రంగా దెబ్బతిన్న విద్యుత్ లైన్లు, విద్యుత్ స్తంభాలు సరఫరా వ్యవస్థను పునరుద్ధరించేందుకు సత్యం పవర్ సిస్టమ్స్ సంస్థ ప్రత్యేక చొరవ తీసుకుంది.సత్యం పవర్ సిస్టమ్స్ చైర్మన్ మిట్టపల్లి ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో సుమారు 35 మంది నైపుణ్యం కలిగిన విద్యుత్ కార్మికులతో పాటు,విద్యుత్ స్తంభాల ఏర్పాటు కోసం ఆగర్ మిషన్లు, బొలెరో వాహనాలు అవసరమైన ఆధునిక పరికరాలను సమకూర్చుకొని కోనసీమ జిల్లాలోని అమలాపురం ప్రాంతానికి ప్రత్యేక బృందాలను తరలించారు.గత వారం రోజులుగా నగరం సబ్‌స్టేషన్ పరిధిలో దెబ్బతిన్న ఇన్‌కమింగ్ 33 కేవీ లైన్లు, అవుట్‌గోయింగ్ 11 కేవీ లైన్ల పునరుద్ధరణ పనులను చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడంలో సత్యం పవర్ సిస్టమ్స్ సిబ్బంది కీలకంగా పనిచేశారు. అంతేకాకుండా పొదలాడ, మామిడికుదురు, తాటిపాక, పెద్దపట్నం లంక తదితర గ్రామాల్లో తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలు, లైన్ల మరమ్మతులు, కొత్త స్తంభాల ఏర్పాటు విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టారు.ఈ పనులన్నింటినీ చైర్మన్ మిట్టపల్లి ప్రవీణ్ కుమార్ స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ, కార్మికులతో కలిసి ప్రత్యక్షంగా పాల్గొంటూ పనులు వేగవంతంగా పూర్తయ్యేలా కృషి చేశారు. స్థానిక



విద్యుత్ శాఖ అధికారులు, ఇంజనీరింగ్ సిబ్బందితో నిరంతరం సమన్వయం చేసుకుంటూ, వారి సూచనలు సహకారంతో వివిధ ప్రాంతాల్లో విద్యుత్ పునరుద్ధరణ పనులను విజయవంతంగా నిర్వహించారు.విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించడం సామాజిక బాధ్యతగా భావించి,సమయం,శ్రమను లెక్కచేయకుండా సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో పనిచేసిన మిట్టపల్లి ప్రవీణ్ కుమార్ చొరవను స్థానిక విద్యుత్ శాఖ అధికారులు అభినందించారు. సిబ్బంది సమయపాలన, పనితీరు, సమన్వయం పట్ల ప్రశంసలు వ్యక్తం చేశారు.విద్యుత్ శాఖకు అవసరమైన సమయంలో తమ సంస్థ తరఫున సిబ్బంది, యంత్రాలు, వాహనాలు సాంకేతిక పరికరాలను అందుబాటులో ఉంచి ప్రజలకు విద్యుత్ సేవలు పునరుద్ధరించడంలో భాగస్వామ్యం కావడం సత్యం పవర్ సిస్టమ్స్‌కు గర్వకారణమని చైర్మన్ మిట్టపల్లి ప్రవీణ్ కుమార్ తెలిపారు.ప్రజా సేవలో,విద్యుత్ పునరుద్ధరణలో ఎల్లప్పుడూ ముందుంటూ విద్యుత్ శాఖకు తమ వంతు సహకారం అందిస్తామని ఆయన పేర్కొన్నారు.

సింగరేణి కార్మికుల దీర్ఘకాలిక పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

- ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ డిమాండ్..



గోదావరిఖని, జనంసాక్షి :

ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క సైతం ఈ సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చిన యాజమాన్యం జాప్యం చేయడం సిగ్గు మాలిన చర్యని ఐ ఎన్ టి యు సి సెక్రటరీ జనరల్ ప్రసాద్ అన్నారు.సింగరేణి కార్మికుల కు సంబంధించిన దీర్ఘకాలిక పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించి, అవసరమైన ఉత్తర్వులు జారీ చేయాలని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ డా. బి. జనక్ ప్రసాద్ సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు, ఉద్యోగులు మరియు వారి కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో యాజమాన్యం జాప్యం చేయడం సమంజసం కాదని పేర్కొన్నారు. ముఖ్యంగా కింది ఐదు ప్రధాన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని కోరారు. సమస్యలపై ఐఎన్‌టీయూసీ తరఫున పలుమార్లు వినతిపత్రాలు సమర్పించి నప్పటికీ యాజమాన్యం ఆశించిన స్థాయిలో చర్యలు తీసుకోక పోవడంపై డా. జనక్ ప్రసాద్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.కార్మికుల సంక్షేమం, ఉద్యోగుల హక్కుల పరిరక్షణే ఐఎన్‌టీయూసీ ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ, ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసి, అన్ని పెండింగ్ సమస్యలపై తక్షణమే ఉత్తర్వులు జారీ చేయాలని సింగరేణి యాజమాన్యాన్ని డా. జనక్ ప్రసాద్ డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో ఆర్జీ-1 వైస్ ప్రెసిడెంట్ సదానందం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఐ ఎన్ టి యు సి జనరల్ సెక్రటరీ వికాస్ కుమార్ యాదవ్, వైస్ ప్రెసిడెంట్ వడ్డేపల్లి దాస్, నాయకులు కోట రవీందర్ రెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు శేషే రత్నం, రీజినల్ జనరల్ సెక్రటరీ ఆరెపల్లి శ్రీనివాస్, మహిళా జనరల్ సెక్రటరీ లలిత శ్రీ, బ్రాంచ్ సెక్రటరీ శ్రీనివాస్, ఖాదర్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన ఎస్సైగా చిరంజీవి బాధ్యతల స్వీకరణ

భీంగల్ నవంబర్ 4 జనంసాక్షి:



భీమ్‌గల్ పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐగా ఎం.చిరంజీవి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ తిరుపతి బదిలీ కావడంతో ఆయన స్థానంలో బాధ్యతలు చేపట్టారు.అనంతరం ఆయన జిల్లా పోలీస్ కమిషనర్ సాయి చైతన్యను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా నూతన ఎస్ఐ తెలిపారు.

నీటిని వృధా చేయకుండా,భూగర్భ జలాలు పెంచడమే లక్ష్యం

సర్పంచ్ గడల ప్రసాద్..

భీంగల్ నవంబర్ 4 జనంసాక్షి:



భీంగల్ మండలం జాగిర్యాల గ్రామంలోజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో పిల్లల చేతులు శుభ్రపరచడానికి వారు వాడిన నీళ్లను కమ్యూనిటీ సోఫిట్ లోకి వెళ్లి భూగర్భ జలాలను పెంచే ఉద్దేశంతో నూతన కమిటీని నిర్మాణం చేసి పూర్తి చేయడం జరిగింది.దీని ద్వారా భూమిలో నీటి శాతాన్ని పెంచి గ్రామానికి మేలు జరిగే విధంగా ఇలాంటి నిర్మాణాలు చేపట్టడం జరిగింది పిల్లలందరూ ఈ నిర్మాణాన్ని చూసి వారు కూడా వారి ఇంట్లో ప్రతి ఇంటికి నిర్మించుకోవాలని నిర్ణయం తీసుకోవడం చాలా మంచి నిర్ణయంలో భావించి వారందరినీ గ్రామ సర్పంచ్ గడలా ప్రసాద్ అభినందించడం జరిగింది.

పేకాట స్థావరంపై పోలీసుల ఆకస్మిక దాడి

రూ.3,200 నగదు, రెండు సెల్‌ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం.. ముగ్గురి అరెస్ట్

బాన్సువాడ నవంబర్ 4 (జనం సాక్షి)

బాన్సువాడ, నవంబర్ 3: బహిరంగ ప్రదేశాల్లో చట్టవిరుద్ధంగా పేకాట ఆడితే కఠిన చర్యలు తప్పవని బాన్సువాడ పోలీసులు హెచ్చరించారు. పేకాట నిర్వహిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం కొత్తబాది గ్రామ పరిధిలోని సంతోష్‌నగర్ సమీపంలో పోలీసులు ఆకస్మిక దాడి నిర్వహించారు.ఈ దాడిలో డబ్బులు పెట్టి పేకాట ఆడుతున్న మాలోత్ చందర్, మేఘావత్ ప్రకాష్, దేవ్ సోత్ శ్రీహరి అనే ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి పేకాటకు సంబంధించిన రూ. 3,200 నగదుతో పాటు రెండు సెల్‌ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.ఈ ఘటనపై బాన్సువాడ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి, తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ తుల శ్రీధర్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాలు, పట్టణాల్లో ఎక్కడైనా పేకాట, ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలు నిర్వహిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, ప్రజలు ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలకు సహకరించకుండా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

కోర్టు సముదాయం వద్ద ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించాలి

పోలీస్ కమిషనర్‌కు బార్ అసోసియేషన్

అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్ వినతి

కరీంనగర్ లీగల్, నవంబర్ 04, (జనంసాక్షి)

కరీంనగర్ కోర్టు సముదాయం ప్రధాన ప్రవేశ, నిష్క్రమణ ద్వారాల వద్ద నెలకొన్న ట్రాఫిక్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కరీంనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్ పోలీస్ కమిషనర్‌ను కోరారు. ఈ మేరకు బుధవారం పోలీస్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా గడ్డం లక్ష్మణ్ మాట్లాడుతూ కోర్టు సముదాయంలో సుమారు 1,600 మంది న్యాయవాదులు విధులు నిర్వహిస్తుండగా, ప్రతిరోజూ 800 నుంచి 900 మంది కక్షిదారులు, ప్రజలు వివిధ పనుల నిమిత్తం వస్తుంటారని తెలిపారు. కోర్టు గేట్ల వద్ద సరైన ట్రాఫిక్ నియంత్రణ లేకపోవడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రద్దీ సమయాల్లో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

కోర్టు గేట్ల వద్ద రద్దీ సమయాల్లో ట్రాఫిక్ పోలీసులను నియమించాలని, వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించాలని, పాదచారుల కోసం ప్రత్యేక క్రాసింగ్‌లు, ట్రాఫిక్ సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. ట్రాఫిక్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. న్యాయవాదులు, న్యాయాధికారులు, కక్షిదారులు, ప్రజల భద్రత దృష్ట్యా సమస్యను తక్షణమే పరిష్కరించాలని పోలీస్ కమిషనర్‌ను కోరారు.

బోధన్ ఆర్టీసీ డిపోలో..

మహిళా కండక్టర్ కు ఘన నివాళులు

బోధన్, నవంబర్ 4 (జనంసాక్షి) :

ఇటీవల ప్రయాణికుల దాడిలో మృతి చెందిన కండక్టర్ ప్రవళిక మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ బుధవారం బోధన్ ఆర్టీసీ డిపోలో డిపో మేనేజర్ విశ్వనాథ్ ఆధ్వర్యంలో మహిళా కండక్టర్ కు ఘన నివాళులు అర్పించారు. మణుగూరు డిపోకు చెందిన కండక్టర్ ప్రవళిక మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ బోధన్ డిపోలోని ఉద్యోగులందరూ 5 నిమిషాల పాటు మౌనం పాటించి ఘనంగా నివాళులర్పించారు. ఈ విషాదకర ఘటన పట్ల ఉద్యోగులు తీవ్రగ్ఞాంతి వ్యక్తం చేశారు. ప్రవళిక కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బోధన్ డిపో మేనేజర్ బి విశ్వనాథ్, ఏఏంఎఫ్ కాశీనాథ్, గిరి, ఎడిసి బిఏ రాణి, సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.





ప్రభుత్వ రేషన్ దుకాణాల్లో 9 రకాల నిత్యావసరాలు

ఉచితంగా అందించాలి: పిఒడబ్ల్యూ డిమాండ్

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 4 జనంసాక్షి:

తెలంగాణ రాష్ట్రంతో పాటు నిజామాబాద్ జిల్లాలో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నందున, పేద ప్రజలను ఆదుకోవడానికి ప్రభుత్వ రేషన్ దుకాణాల ద్వారా 9 రకాల నిత్యావసర వస్తువులను ఉచితంగా అందించాలని ప్రగతిశీల మహిళా సంఘం (పిఒడబ్ల్యూ) నగర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం జిల్లా పరిపాలన అధికారులకు పిఒడబ్ల్యూ నాయకులు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా పిఒడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. భారతి, నగర అధ్యక్ష, కార్యదర్శులు నీలం లక్ష్మి, గొంట్యాల సంజన మాట్లాడుతూ కరువు కారణంగా పంటలు పండక, ఉపాధి దొరక్క ప్రజల కొనుగోలు శక్తి పూర్తిగా పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే సమయాన్ని ఆసరాగా చేసుకుని కొంతమంది వ్యాపారులు లాభార్జనే ధ్యేయంగా పేదలు తినే బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసి కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని తెలిపారు. గతంలో ?1200 ఉన్న బియ్యం బస్తా ధరను ప్రస్తుతం ?2200 వరకు పెంచి అమ్ముతున్నారని, దీనివల్ల పేదలు పస్తులు ఉండాల్సిన పరిస్థితి దాపురించిందని విమర్శించారు.మరోవైపు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పడుతోందని, వాటిని పునర్వినియోగం (రీసైక్లింగ్) చేసి సన్న బియ్యంగా మార్చి అధిక ధరలకు విక్రయిస్తున్నారని వారు ఆరోపించారు. రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్న అక్రమార్కులపై, కృత్రిమ కొరత సృష్టిస్తున్న రైస్ మిల్లుల యాజమాన్యాలు, వ్యాపారులపై తీవ్రమైన చట్టపరమైన కేసులు (పిడి యాక్ట్) నమోదు చేయాలని డిమాండ్ చేశారు.కరువుతో అల్లాడుతున్న పేదలకు రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యంతో పాటు కందిపప్పు, పెసరపప్పు, వంట నూనె, చక్కెర, చింతపండు, కారం తదితర 9 రకాల నిత్యావసర వస్తువులను ప్రభుత్వమే ఉచితంగా పంపిణీ చేసి ఆకలి తీర్చాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో పిఒడబ్ల్యూ నాయకులు మసాల్కర్ సురేఖ, రేఖ, భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భూభారతి లీ సర్వేను సద్వినియోగం చేసుకోండి

బోధన్ ఆర్డీవో విజయ కుమారి

ఎడపల్లి, నవంబర్ 4 (జనంసాక్షి) :



తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న భూభారతి రీ సర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని బోధన్ ఆర్డీవో విజయ కుమారి కోరారు. బుధవారం ఎడపల్లి మండల తాసిల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వం భూభారతి రీ సర్వేతో రైతుల భూములు ఖచ్చితమైన కొలతలు పొందే అవకాశం ఉందని అందువల్ల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే తాసిల్దార్ కార్యాలయంలో పెండింగ్ లో ఉన్న ఫైళ్లను పరిశీలించి వాటిని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎడపల్లి మండల తాసిల్దార్ దత్తాద్రి, రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

వీణవంక లో ఘనంగా వాసవి క్లబ్ సేవా పురస్కారాలు

వీణవంక నవంబర్ 4 (జనంసాక్షి)



వీణవంక మండలంలోని లక్ష్మీగణపతి గార్డెన్ లో జరిగిన రామిడి వారి సేవాపురస్కారాలు రీజియన్ చైర్మెన్ వాసవీయన్ రామిడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అథితిగా వాసవీయన్ దొడ్డ మోహన్ రావు, అబ్సర్వర్ గా వాసవీయన్ జైన అర్చన రాజ్,ఐఈసి అధికారులు వాసవీయన్ పవిత్రం శ్రీనివాసు, కలికోట శ్రీనివాస్,ఇల్లెందుల కిషోర్ కుమార్,ప్రోగ్రాం చైర్మెన్ వాసవీయన్ గంప సురేందర్,జోన్ చైర్మెన్లు వాసవీయన్ చిట్టుమల్ల హరిబాబు,అయితు రమేష్,స్వామిశెట్టి అఖిలాండం, పాలవరపు శ్రీనివాస్, రీజియన్ సెక్రెటరీ గుండా కేదారీ,వీరి రీజియన్ లో ఉన్న13 క్లబ్బుల అధ్యక్షులు,ప్రధాన కార్యదర్శులు , కోశాధికారులు,క్లబ్ సభ్యులు,రీజియన్ లోని క్యాబినేట్ సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఈ సంవత్సరం వాసవి క్లబ్స్ ద్వారా చేసిన సమాజసేవకు అవార్డులు అదించడం జరిగినది. ఈ కార్యక్రమ ముఖ్య అథితి మాట్లాడుతూ వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ద్వారా సమాజంలోని నిరుపేదలకు, అవసరార్థులకు సేవలు, సహాయసహకారాలు అదించే ఏకైక సంస్థ వాసవి క్లబ్స్ అని తెలియచేశారు.

ఏటా రూ.100కోట్ల బడ్జెట్ కేటాయించే వరకు పోరాటం ఆగేది లేదు

○తురక కాశ హక్కుల సాధనకై ప్రతి ఒక్కరూ నడుం బిగించాలి...

○జిల్లా సర్వసభ్య సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు షేక్ బడేసాబ్ పిలుపు

○కొండాపూర్ లో జిల్లా అధ్యక్షుడు కాసిం అధ్యక్షతన సమావేశం నిర్వహణ



చిగురుమామిడి నవంబర్ 04(జనంసాక్షి):
తురక కాషా సంక్షేమం కోసం ప్రతి ఏటా రూ.100కోట్ల బడ్జెట్ కేటాయించే వరకు పోరాటం ఆగేది లేదని తురక కాశ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బడే సాబ్, జిల్లా అధ్యక్షుడు షేక్ ఖాసీంలు తెలిపారు.తెలంగాణ తురక కాశ సంక్షేమ సంఘం కరీంనగర్ జిల్లా సర్వసభ్య సమావేశాన్ని చిగురుమామిడి మండలం కొండాపూర్ గ్రామంలో బుధవారం పెద్ద ఎత్తున నిర్వహించారు.కరీంనగర్ జిల్లా తురక కాశ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు షేక్ కాసిం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సంఘ బలోపేతం,భవిష్యత్తు కార్యాచరణ, ఎదుర్కొంటున్న సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ తురక కాశ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్ బడేసాబ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ షరీఫ్, లీగల్ సెల్ ఇంచార్జ్ సయ్యద్ జామిన్ భాష లు హాజరయ్యారు.ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు బడేసాబ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న తురక కాశలను ఐక్యం చేస్తూ సంఘాన్ని మరింత బలోపేతం చేయడానికి తాము నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు.సమాజంలో వెనుకబడిన తురక కాశలందరూ తమ న్యాయమైన హక్కుల సాధన కోసం ఏకతాటిపైకి వచ్చి నడుం బిగించాలని ఆయన పిలుపునిచ్చారు.ప్రభుత్వాలు తురక కాశల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేయకుండా,వారి సమగ్ర అభివృద్ధి కోసం ప్రతి ఏటా బడ్జెట్ లో రూ.100కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం ఈ బడ్జెట్ ను అధికారికంగా కేటాయించే వరకు తురక కాశల న్యాయపోరాటం ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగేది లేదని స్పష్టం చేశారు.ముఖ్యంగా సమాజంలో మార్పు తీసుకురావడానికి యువత కీలక పాత్ర పోషించాలని, యువతీ యువకులు మొద్దు నిద్ర వీడి తురక కాశల హక్కుల సాధన కోసం కదలి రావాలని, పోరాటాల్లో ముందుండాలని పిలుపునిచ్చారు.ఈ మహాసభలో కొండాపూర్ గ్రామ సర్పంచ్ మార్క రాజ్ కుమార్ గౌడ్ తోపాటు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు అబ్దుల్ రహీం, వలి, ప్రముఖ నాయకులు షేక్ షాదుల్లా, సూర్యాపేట జిల్లా అధ్యక్షులు జానీ, నిజామాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ కరీం,అష్టల్,జిల్లా వ్యాప్తంగా ఉన్న తురక కాశ సంఘాల ప్రతినిధులు, సభ్యులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



విప్లవోద్యమంలో ప్రాణాలర్పించిన అమరవీరులకు విప్లవ జోహార్లు

○జేసీఎస్ ప్రసాద్ ఆశయాలను కొనసాగిస్తాం: సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్

○కోటగల్లి ఎన్.ఆర్ భవన్ లో ఘనంగా అమరవీరుల వర్ధంతి సభ

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 4 జనం సాక్షి:
భారత కమ్యూనిస్టు విప్లవోద్యమంలో పీడిత ప్రజల విముక్తి కోసం తమ ప్రాణాలను త్యాగం చేసిన అమరవీరులను స్మరిస్తూ, సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అమరవీరుల వర్ధంతి సభ ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని కోటగల్లిలో ఉన్న ఎన్.ఆర్ భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.సభ ప్రారంభంలో అమరవీరుడు కామ్రేడ్ జేసీఎస్ ప్రసాద్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించి, విప్లవ నివాళులర్పించారు.సామాజిక మార్పు కోసమే అమరుల త్యాగాలు: వనమాల కృష్ణ ఈ సందర్భంగా సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ మాట్లాడుతూ... జీవితం ఎంతో విలువైనదని, అయితే కమ్యూనిస్టు విప్లవకారులు తమ స్వార్థం కోసం కాకుండా సూతన ప్రజాస్వామిక విప్లవం, సోషలిస్టు సమాజ స్థాపనే లక్ష్యంగా పోరాడారని గుర్తుచేశారు. గత 58 సంవత్సరాల కాలంలో దేశవ్యాప్తంగా వేలాది మంది విప్లవకారులు తమ జీవితాలను త్యాగం చేశారన్నారు.కామ్రేడ్లు దేవులపల్లి వెంకటేశ్వర రావు, చంద్ర పుల్లారెడ్డి, తరిమెల నాగిరెడ్డి, కొల్లా వెంకయ్య, కానూ సన్యాల్, సత్యనారాయణ సింగ్, చారుమజుందార్, రాయల సుభాష్ చంద్రబోస్, పోట్ల రామనర్సయ్య, నీలం రామచంద్రయ్య, డివి కృష్ణ, చంద్రశేఖర్ లతో పాటు నిజామాబాద్ జిల్లాకు చెందిన అమరులు జేసీఎస్ ప్రసాద్, యాదగిరి, కిరణ్ కుమార్, ఎల్లన్న, సాయిలు తదితరుల పోరాటాలను కొనియాడారు. వారి ఆశయ సాధనకు పునరంకితం కావడమే వారికిచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.ఫాసిస్ట్ ధోరణులపై పోరాటాలు విస్తృతం కావాలి కేంద్రంలోని మోడీ ప్రభుత్వం దేశ సంపదను, ప్రజల భూములు–వనరులను కార్పొరేట్ కంపెనీలకు దోచిపెడుతోందని వనమాల కృష్ణ విమర్శించారు. మతోన్మాదం, విద్వేష రాజకీయాలతో ప్రజల ఐక్యతను దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై యువత, విద్యార్థులు, ప్రజాస్వామ్యవాదులు వీధుల్లోకి వచ్చి ప్రశ్నించే ప్రస్థానం మొదలైందని, ఈ పోరాటంలో కమ్యూనిస్టులు, ప్రగతిశీల శక్తులు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. భిన్నత్వంలో ఏకత్వం కలిగిన భారతదేశం ఫాసిజానికి తలవంచదని స్పష్టం చేశారు.కార్యక్రమంలో పాల్గొన్న నాయకులుఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ రాష్ట్ర నాయకులు ఎం.నరేందర్, నిజామాబాద్, బోధన్ డివిజన్ కార్యదర్శులు ఎం.వెంకన్న, డి.రాజేశ్వర్, నగర కార్యదర్శి ఎం.సుధాకర్, జిల్లా నాయకులు కే.గంగాధర్, బి.మల్లేష్, డి.కిషన్ పాల్గొన్నారు.అలాగే పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.గోదావరి, కే.సంధ్యారాణి, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్, సిఎల్సి జిల్లా సహాయ కార్యదర్శి భాస్కరస్వామి, వివిధ ప్రజా సంఘాల నాయకులు ఒడ్డెన్న, లింగం, మోహన్, గంగాధర్, నాగమణి, అమూల్య, గీత, సృజన్, రమేష్, గురు, రామా నర్సయ్య, మానస, సుజాత తదితరులు పాల్గొన్నారు.





డ్రైవర్ పై మాజీ ఎమ్మెల్యే దాడికి నిరసనగా..

- లారీ డైవర్లు చౌరస్తాలో బైటాయింపు.. - చర్యలు తీసుకోవాలని డిమాండ్..

గోదావరిఖని, జనంసాక్షి :
స్థానిక ప్రధాన చౌరస్తాలో బిఆర్ఎస్ పైలాన్ తొలగిస్తున్న క్రమంలో క్రేన్ డ్రైవర్ పై మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ దాడి చేయడాన్ని నిరసిస్తూ లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం గోదావరిఖని లారీ డ్రైవర్లు ప్రధాన చౌరస్తాలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చందర్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చందర్ పద్ధతి మార్చుకోవాలని హేచ్చరించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో లారీ డ్రైవర్లు పాల్గొన్నారు.

నిజామాబాద్‌లో వైభవంగా 'జిల్లా స్థాయి సాంస్కృతిక ఉత్సవాలు 2026-27'

జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించిన నగర మేయర్ కూరగాయల ఉమారాణి రమేష్



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 4 జనం సాక్షి:
జిల్లా యువజన మరియు క్రీడల కార్యాలయం ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని ఖలీల్ వాడి లో గల న్యూ అంబేద్కర్ భవన్‌లో "జిల్లా స్థాయి సాంస్కృతిక ఉత్సవాలు 2026-27" యువ కళాకారుల ఎంపిక పోటీలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి నిజామాబాద్ నగర మేయర్ కూరగాయల ఉమారాణి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను అధికారికంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా మేయర్ కూరగాయల ఉమారాణి రమేష్ మాట్లాడుతూ... భారతీయ సంస్కృతి, తెలంగాణ కళా వైభవాన్ని కాపాడాల్సిన గొప్ప బాధ్యత నేటి యువతపై ఉందన్నారు. సంస్కృతీ సంప్రదాయాలే మన సమాజానికి బలమైన మూలస్తంభాలని ఆమె పేర్కొన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో దాగి ఉన్న యువతీ యువకుల సృజనాత్మక ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి ప్రభుత్వ కార్యక్రమాలు ఒక చక్కటి వేదికగా ఉపయోగపడతాయని తెలిపారు.ఈ జిల్లా స్థాయి పోటీలలో తమ అత్యుత్తమ ప్రతిభను కనబరిచి ఎంపికైన కళాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలలో పాల్గొని నిజామాబాద్ జిల్లా ఖ్యాతిని నలుమూలలా చాటిచెప్పాలని మేయర్ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారులు, వివిధ పోటీల న్యాయనిర్ణేతలు, పలువురు నగర ప్రముఖులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్న వివిధ విభాగాల కళాకారులు, యువతీయువకులు పాల్గొన్నారు.

ఖేలో ఇండియా కబడ్డీ శిక్షణ శిబిరానికి నిజామాబాద్ జిల్లా క్రీడాకారిణులు

సిరివెన్నెల గౌతమిలకు అవకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ హర్షం



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 4 జనంసాక్షి:
డిసెంబర్‌లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఖేలో ఇండియా టోర్నమెంట్ లో పాల్గొనేందుకు సన్నద్ధం చేసే కబడ్డీ శిక్షణ శిబిరానికి నిజామాబాద్ జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారిణులు ఎంపికయ్యారు. జిల్లాకు చెందిన సిరివెన్నెల, గౌతమిలు ఈ నెల 1వ తేదీ నుంచి హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో నిర్వహించనున్న ఖేలో ఇండియా కబడ్డీ శిక్షణ శిబిరానికి ఎంపికైనట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు అంద్యాల లింగయ్య, ప్రధాన కార్యదర్శి కె. గంగాధర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.ప్రస్తుతం వీరిద్దరూ ఇందల్వాయిలోని టీజీటీడబ్ల్యూఆర్ జేసీ (బాలికల) కళాశాలలో విద్యనభ్యసిస్తున్నారు. చదువుతోపాటు కబడ్డీ క్రీడలో ప్రతిభ కనబరుస్తూ ప్రతిష్ఠాత్మకమైన ఖేలో ఇండియా శిక్షణ శిబిరానికి ఎంపిక కావడం పట్ల జిల్లా క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.నిజామాబాద్ జిల్లా నుంచి ఇద్దరు క్రీడాకారిణులు ఈ శిక్షణ శిబిరానికి ఎంపిక కావడం గర్వకారణమని జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు, సీనియర్ కబడ్డీ క్రీడాకారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సిరివెన్నెల, గౌతమిలను అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలలో స్వర్ణ పతకం

సిరికొండ నవంబర్ 04 (జనం సాక్షి):

మండలంలోని సత్యశోధక్ పాఠశాల విద్యార్థిని రెబ్బ హరిప్రియ రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి స్వర్ణ పతకం సాధించినట్లు ప్రిన్సిపల్ రావుట్ల నర్సయ్య తెలిపారు.గత నెల 31 నుంచి నవంబర్ 2, 2026 వరకు నిర్మల్ జిల్లా ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నిర్వహించిన 12వ తెలంగాణ రాష్ట్రస్థాయి జూనియర్ అంతర్‌జిల్లా సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ 2026?27 ఏడాది బాలికల విభాగంలో నిజామాబాద్ జిల్లా జట్టు ఛాంపియన్‌గా నిలిచి అద్భుత విజయాన్ని సాధించినట్లు చెప్పారు. జట్టుకు సత్యశోధక్ పాఠశాల విద్యార్థిని రెబ్బ హరిప్రియ ప్రాతినిధ్యం వహించి తన క్రీడా ప్రతిభను చాటి, జట్టు విజయంలో భాగస్వామిగా నిలిచి స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. జిల్లా ,



రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రదర్శనతో జట్టు విజయానికి తోడ్పడి పాఠశాలకు, జిల్లాకు గర్వకారణంగా నిలిచిందని పేర్కొన్నారు. స్వర్ణ పతకం సాధించిన విద్యార్థిని రెబ్బ హరిప్రియను సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు శోభన్, నవీన్, గంగామోహన్ అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఆమె విజయానికి సహకరించిన తల్లిదండ్రులు, వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్‌లను ప్రశంసించారు. క్రీడల్లో ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి చదువుతో పాటు క్రీడలకు కూడా పాఠశాల సమాన ప్రాధాన్యతనిస్తుందని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

పెంచికల్ పేట్ లో నిత్యం వెలుగుతున్న వీధి దీపాలు..!

విద్యుత్ వృథాపై ఆవేదన వ్యక్తం చేసిన వార్డు మెంబర్ల ఫోరం అధ్యక్షులు ఇరుగురాల పరమేశ్వర్

కమాన్ పూర్, నవంబర్ 04, (జనంసాక్షి)



పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండల కేంద్రంలోని పెంచికల్ పేట్ గ్రామంలో గత కొన్ని రోజులుగా వీధి దీపాలు నిత్యం వెలుగుతూనే ఉన్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా 24 గంటలూ లైట్లు వెలగడంతో విద్యుత్ వృథా అవుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎల్‌నినో నేపథ్యంలో విద్యుత్ పొదుపు చేయాలని ప్రభుత్వం సూచిస్తున్నప్పటికీ, పెంచికల్ పేటలో వీధి దీపాలు నిరంతరం వెలుగుతున్నాయి. అవసరం లేని సమయాల్లోనూ లైట్లు వెలగడంతో ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లుతోంది. ఈ సందర్భంగా కమాన్ పూర్ మండల వార్డు మెంబర్ల ఫోరం అధ్యక్షులు ఇరుగురాల పరమేశ్వర్ మాట్లాడుతూ.. పగటి పూట కూడా వీధి దీపాలు వెలుగుతూ ఉండటం దారుణమన్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే విద్యుత్ వృథా అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వీధి దీపాల నిర్వహణలో సమయపాలన పాటించాలని, సాయంత్రం 6 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకే లైట్లు వేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెంటనే అధికారులు స్పందించి విద్యుత్ వృథాను అరికట్టాలని, లేని పక్షంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. గ్రామంలో విద్యుత్ సమస్యలు, వీధి దీపాల నిర్వహణపై పంచాయతీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.



కళలకు నిలయం ఇందూరు

జిల్లా స్థాయి యువజనోత్సవంలో ఎమ్మెల్యే ధన్ పాల్

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 4 జనంసాక్షి:

కళలకు, క్రీడలకు నిలయంగా ఇందూరు నిలుస్తోందని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. మేరా యువ భారత్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యువజనోత్సవాల ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం యువతను అనేక రకాలుగా ప్రోత్సహిస్తోందన్నారు. ప్రధానంగా " మై భారత్ " పేరుతో యువతలో నాయకత్వ లక్షణాలు, సామాజిక సేవాభావం పెంపొందించేలా తీర్చిదిదుతుందన్నారు. యువతలో విద్యా, నైపుణ్యం, క్రీడా స్ఫూర్తి, సామాజిక బాధ్యత, దేశభక్తి వంటి లక్షణాలు ఉండాలన్నారు. ఇటువంటి పోటీల ద్వారా ఈ లక్షణాలు అలవడుతా యన్నారు. క్రీడాకారులకు యువ కళాకారులకు తన వంతు సహాయం తన ట్రస్టు ద్వారా ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ఇందూరులో పెండింగ్లో ఉన్న కళాభారతి, క్రీడా స్టేడియాలను పూర్తి చేయడమే తన లక్ష్యమన్నారు. ఇప్పటికే అనేకసార్లు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు గుర్తు చేశారు. అలాగే జిల్లా స్థాయిలో గెలుపొందిన వారు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి ఇందూరు పేరును నిలబెట్టాలన్నారు. అలాగే యువత డ్రగ్స్ కి, మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ కళల్లో రాణించాలన్నారు. అనంతరం ఆయా అంశాల్లో గెలుపొందిన యువతీ యువకులకు బహుమతులను



అందజేశారు. కార్యక్రమంలో జిల్లా యువజన అధికారి రమేష్, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి పవన్ కుమార్, తెలంగాణ విశ్వ విద్యాలయం ప్రొఫెసర్ అపర్ణ, బాలభవన్ సూపరింటెండ్ ఉమాబాల, న్యాయ నిర్ణేతలు పుష్ప, శ్వేతా రెడ్డి, సిర్ప లింగం, కోకిల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



క్షత్రియ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో ఎంబీఏ ఫ్రెషర్స్ పార్టీ : ఆగాజ్ 2కే26

ఆర్మూర్, నవంబర్ 4 (జనంసాక్షి):

ఆర్మూర్ పరిధిలోని చేపూర్ క్షత్రియ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో ఎంబీఏ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు స్వాగతం పలుకుతూ "ఆగాజ్ 2కి?26" పేరుతో ఫ్రెషర్స్ పార్టీని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమం ద్వారా నూతనంగా కళాశాలలో అడుగుపెట్టిన ఎంబీఏ విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో సీనియర్ విద్యార్థులతో పరిచయ కార్యక్రమం నిర్వహించారు.విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, సృజనాత్మకత, పరస్పర సహకార భావనను పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశంగా సాగింది.ఈ వేడుకలో విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు,ఆటపాటలు,వినోద కార్యక్రమాలు,ప్రతిభా ప్రదర్శనలతో సందడి చేయనున్నారు.కళాశాల విద్యార్థి జీవితంలో ఫ్రెషర్స్ పార్టీ ఒక మధురమైన జ్ఞాపకంగా నిలవడంతో పాటు, నూతన విద్యార్థులకు సరికొత్త అనుభూతిని అందించనుంది.ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ అల్లాపూర్ దేవేందర్ మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొనాలని,ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం,నాయకత్వ లక్షణాలు,సృజనాత్మకతను పెంపొందిస్తాయని తెలిపారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కళాశాల ఎల్లప్పుడూ ప్రాధాన్యతనిస్తుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్య ప్రతినిధులు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కటకం శ్రీనివాస్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శ్రీ బి. నరేందర్,ఎంబీఏ విభాగాధిపతి పాశం సుధాకర్,వివిధ విభాగాల అధిపతులు ,సోషల్ మీడియా ఇన్‌చార్జ్ శ్రుతిన్ , అధ్యాపకులు,ఎంబీఏ విద్యార్థులు పాల్గొన్నారు.



ధర్పల్లి?సిరికొండ ప్రధాన రహదారిపై పోలీసుల తనిఖీలు

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం.. వాహనదారులకు అవగాహన

సిరికొండ, నవంబర్ 4 జనం సాక్షి:

రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రజల భద్రతే లక్ష్యంగా పోలీసులు వాహన తనిఖీలను ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా బుధవారం ధర్పల్లి?సిరికొండ ప్రధాన రహదారిపై సర్పల్లి తండా గ్రామ సరిహద్దులో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా రహదారిపై రాకపోకలు సాగిస్తున్న వాహనాలను ఆపి వాటి డ్రువపత్రాలను పరిశీలించారు. వాహనదారులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్ పత్రాలు కలిగి ఉండాలని, వాహనాలకు సక్రమమైన నంబర్ ప్లేట్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించేవారు సీటు బెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని అవగాహన కల్పించారు.రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, వాహన తనిఖీల సమయంలో పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ తనిఖీల్లో పోలీసు సిబ్బంది నరేష్, తేజ, సుధాకర్, రాకేష్ పాల్గొన్నారు.





అర్ధరాత్రి ఏటీఎం చోరీకి దొంగల యత్నం విఫలం..

ఆర్మూర్,నవంబర్ 4 (జనంసాక్షి):

ఆర్మూర్ పట్టణంలోని ఓ ప్రైవేట్ బ్యాంకు ఏటీఎంలో చోరీకి గుర్తుతెలియని దుండగులు యత్నించారు. అర్ధరాత్రి మంగళవారం ఘటన చోటుచేసుకుంది. అర్ధరాత్రి సమయంలో ఏటీఎంలోకి ఇద్దరు దొంగలు ప్రవేశించి రాడు సహాయంతో ధ్వంసం చేశారు. ఏటీఎంలోని నగదును ఎత్తుకెళ్లేందుకు యత్నించారు. ఏటీఎం లోపల ఉన్న నగదు పెట్టెలు తెరిచికొకపోవడంతో దుండగులు అక్కడి నుండి పారిపోయారు.సమాచారం అందుకున్న పట్టణ సీఐ చంద్రశేఖర్ రెడ్డి,ఎస్సై రంజిత్ ఘటన స్థలాన్ని, సీసీటీవీ కెమెరాలను పరిశీలించారు.పోలీసులు కేసు నమోదు చేసుకుని సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా నిందితుల కోసం గాలిస్తున్నారు.

గన్నేరువరం, ఉమ్మడి బెజ్జంకి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా మాతంగి శిరీష అనిల్ ప్రమాణ స్వీకారం

గన్నేరువరం, నవంబర్ 04 (జనంసాక్షి):

గన్నేరువరం, ఉమ్మడి బెజ్జంకి వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ గా నియమితులైన మాతంగి శిరీష అనిల్ బుధవారం ఘనంగా ప్రమాణ స్వీకారం చేశారు. మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆశీస్సులతో ఈ పదవి దక్కడం గన్నేరువరం మండలానికి గర్వకారణంగా నిలిచింది.

పుట్టిన ఊరిలో ప్రమాణ స్వీకారం - అత్తగారి ఊరు నుండి భారీ ర్యాలీ:

శిరీష అత్తగారి ఊరైన గన్నేరువరం మండల కేంద్రం నుండి కార్యకర్తలు, అభిమానులు, మహిళా సంఘాలతో భారీ బైక్ ర్యాలీ, కార్ల ర్యాలీగా బయలుదేరారు. దారి పొడవునా పూల వర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు.ముందుగా గన్నేరువరం మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి, అక్కడి నుండి బెజ్జంకి మార్కెట్ యార్డ్ కు చేరుకుని ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్నారు.

మహిళా శక్తికి ప్రతీక:

మాతంగి శిరీష అనిల్ ఒక సాధారణ కుటుంబం నుండి వచ్చి,రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకున్నారు. విద్యావంతురాలు, సేవా తత్పరత కలిగిన మహిళగా ఆమెకు మంచి పేరుంది.

చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె మాట్లాడుతూ..

"నన్ను నమ్మి ఈ బాధ్యత అప్పగించిన కాంగ్రెస్ పార్టీకి, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కి కృతజ్ఞతలు, రైతుల సంక్షేమమే నా ప్రధాన లక్ష్యం. మార్కెట్ యార్డ్ లో రైతులకు మెరుగైన సౌకర్యాలు, గిట్టుబాటు ధర కల్పించేందుకు కృషి చేస్తా. మహిళగా అందరికీ అందుబాటులో ఉంటూ సేవ చేస్తా" అని హామీ ఇచ్చారు.





వైస్ చైర్మన్ పర్ష సంతోష్, డైరెక్టర్లు జెల్లా రాజేశ్వర్,దేశరాజు అనిల్, మైసంపల్లి తిరుపతి,నందికొండ తిరుపతి రెడ్డి, బెజ్జంకి మండల డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు.

బెజ్జంకి మండల కాంగ్రెస్ అధ్యక్షులు లింగాల శ్రీనివాస్,గన్నేరువరం మండల అధ్యక్షుడు బొడ్డు సునీల్, పలువురు నాయకులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.ఒక మహిళ, అందులోనూ కోడలిగా మరో మండలం నుండి వచ్చి అత్తగారి మండలం పేరు నిలబెట్టడం, పుట్టిన ఊరిలోనే ప్రమాణం చేయడం అందరినీ ఆకట్టుకుంటోంది.

కరువు బాధిత రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి

- హుజూరాబాద్‌కు ప్రత్యేక ప్యాకేజీ కింద అధిక నిధులు కేటాయించాలి
- ఓసీ జేఏసీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పూసల ప్రభావతి రెడ్డి డిమాండ్

హుజూరాబాద్, నవంబర్ 4 (జనం సాక్షి): హుజూరాబాద్ మండలాన్ని కరువు మండలంగా ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, క్షేత్రస్థాయిలో రైతులకు ఆశించిన స్థాయిలో సహాయ సహకారాలు అందడం లేదని ఓసీ జేఏసీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పూసల ప్రభావతి రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కరువు పరిస్థితులతో తీవ్రంగా నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం తక్షణమే స్పందించి హుజూరాబాద్ మండలానికి ప్రత్యేక ప్యాకేజీ కింద అధిక నిధులు కేటాయించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రభావతి రెడ్డి మాట్లాడుతూ.. ఈ ఏడాది నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, తీవ్ర నీటి ఎద్దడి కారణంగా రైతులు సాగు చేసిన పంటలు ఎండిపోయి తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారని తెలిపారు. పెట్టుబడుల కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం లేక రైతులు ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయంపైనే ఆధారపడి జీవించే రైతు కుటుంబాలు కరువు ప్రభావంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. కరువు మండలంగా ప్రకటించడం కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, రైతులకు వాస్తవంగా ప్రయోజనం చేకూరేలా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించాలని సూచించారు. పంటలు పూర్తిగా దెబ్బతిన్న రైతులకు ఎకరాకు తగిన నష్టపరిహారం అందించాలని, పంట నష్టాన్ని పక్షపాతం లేకుండా క్షేత్రస్థాయిలో అంచనా వేయాలని కోరారు. వ్యవసాయ అధికారులు గ్రామాల వారీగా పంటల పరిస్థితిని పరిశీలించి పారదర్శకంగా నివేదికలు రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు తగ్గిపోతున్న నేపథ్యంలో ఉపాధి హామీ పనులను విస్తృతంగా చేపట్టాలని, కూలీలకు నిరంతరం పని కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కరువు ప్రభావిత ప్రాంతాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టడంతో పాటు, పశువులకు మేత, నీటి సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేక నిధులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. హుజూరాబాద్ ప్రాంతంలో సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు, కాల్వల నిర్మాణం, మరమ్మతు పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. సాగునీటి వనరులను అభివృద్ధి చేసి చివరి ఆయకట్టు వరకు నీరు అందేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని కోరారు. ప్రతి ఏడాది వర్షాభావ పరిస్థితులు ఎదురైనప్పుడు రైతులు నష్టపోకుండా దీర్ఘకాలిక చర్యలు చేపట్టడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. రైతులు తీసుకున్న పాత వ్యవసాయ రుణాలను రీషెడ్యూల్ చేసేలా బ్యాంకులకు ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని, ప్రస్తుత సాగు అవసరాల కోసం కొత్త రుణాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. పంటలు దెబ్బతిన్న కారణంగా రైతులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఒత్తిడిని దృష్టిలో ఉంచుకొని రుణాల వసూళ్ల విషయంలోనూ మానవతా దృక్పథంతో



వ్యవహరించాలని కోరారు. కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు హుజూరాబాద్ మండలానికి ప్రత్యేక నిధులు విడుదల చేసి, వ్యవసాయం, తాగునీరు, ఉపాధి, సాగునీటి రంగాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆమె సూచించారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం పెంచి కరువు నివారణ చర్యలను వేగవంతం చేయాలని అన్నారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యత కావాలని, కష్టకాలంలో రైతులకు అండగా నిలవడం పాలకుల బాధ్యత అని పూసల ప్రభావతి రెడ్డి పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పంట నష్టపరిహారం, ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ, రుణ సదుపాయాలు, సాగునీటి పనులపై తక్షణ నిర్ణయాలు తీసుకొని హుజూరాబాద్ రైతాంగానికి భరోసా కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు.

సాహిత్య ప్రక్రియల విస్తృతితోనే
సామాజిక చైతన్యం

శాతంవాహన వీసీ ప్రొఫెసర్ ఉమేశ్ కుమార్

కరీంనగర్ టౌన్, నవంబర్ 04, (జనంసాక్షి)

సాహిత్యంలోని వివిధ ప్రక్రియల విస్తృతితోనే సమాజంలో సామాజిక చైతన్యం సాధ్యమవుతుందని శాతవాహన విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ యు.ఉమేశ్ కుమార్ అన్నారు. శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల తెలుగు విభాగం, శాతవాహన విశ్వవిద్యాలయం తెలుగు విభాగం సంయుక్తంగా నిర్వహించిన రెండు రోజుల కార్యశాల బుధవారం ముగిసింది.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన వీసీ ఉమేశ్ కుమార్ మాట్లాడుతూ తనకు విద్యాబుద్ధులు నేర్పిన తెలుగు గురువును స్మరించుకున్నారు. తాను తెలుగు సబ్జెక్టులో ప్రథమ శ్రేణి విద్యార్థినని తన విద్యార్థి దశను గుర్తు చేసుకున్నారు. మధ్యతరగతి కుటుంబాలకు చెందిన కళాశాల విద్యార్థులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కల్వకుంట రామకృష్ణ మాట్లాడుతూ సామాజిక మాధ్యమాలు సమాజానికి దర్పణం పడతాయని, వాటిని సమాజానికి ఉపయోగపడేలా సృజనాత్మకంగా వినియోగించుకోవాలని విద్యార్థులకు సూచించారు. తెలంగాణ ఉన్నత విద్యాశాఖ జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు, టీజీసీజీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి మాట్లాడుతూ మాతృభాషలో భావవ్యక్తీకరణ సులభంగా ఉంటుందని, సామాజిక మాధ్యమాల ద్వారా విద్యార్థులు తమ సృజనాత్మకతను, నైపుణ్యాలను పెంపొందించుకోవాలని అన్నారు.తెలుగు విభాగాధిపతి డాక్టర్ బూర్ల చంద్రశేఖర్ రెండు రోజుల కార్యశాలలో రిసోర్స్ పర్సన్లు అందించిన అంశాలు, విషయ పరిజ్ఞానాన్ని వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ టి.రాజయ్య, స్టాఫ్ క్లబ్ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ రెడ్డి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





సీఎం రేవంత్ రెడ్డి ని కలిసిన టీజేఎస్ రాష్ట్ర కమిటీ

హుజూరాబాద్, నవంబర్ 4 (జనంసాక్షి) :
తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ కోదండరాం నాయకత్వంలో టీజేఎస్ రాష్ట్ర కమిటీ మంగళవారం సీఎం రేవంత్ రెడ్డిని కలిసి రాష్ట్రం లో పెండింగ్ లో ఉన్న పలు సమస్యలతో పాటు స్థానిక సమస్యలను చర్చించినట్లు తెలంగాణ జన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు ముక్కెర రాజు తెలిపారు. ఎల్ నినో కారణంగా ఇబ్బంది పడుతున్న రైతులను ఆదుకోవాలని, విద్యార్థులకు రావాల్సిన ఫీజ్ రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని, ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, తెలంగాణ ఉద్యమకారుల కోసం తగిన సహాయక చర్యలను తీసుకోవాలని పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టుల నిర్మాణాన్ని పూర్తి చేయాలని, ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని, వారు ముఖ్యమంత్రిని కోరగా దానికి సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి అన్ని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు ముక్కెర రాజు తెలిపారు.



సింగరేణి జీఎం లలిత్ కుమార్ చొరవతో యువతకు ఉపాధి అవకాశాలు..

గోదావరిఖని, జనంసాక్షి :
సింగరేణి సంస్థ రామగుండం ఏరియా.1 జనరల్ మేనేజర్ డి. లలిత్ కుమార్ చొరవతో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా మరో ముందడుగు పడింది.మచ్చుపేట గ్రామ పంచాయతీ పరిధిలోని నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ అందించాలనే లక్ష్యంతో జగిత్యాల నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ (న్యాక్) శిక్షణ కేంద్రంలో మూడు నెలల పాటు వెల్డర్ ట్రేడ్‌లో శిక్షణ పొందేందుకు 22 మంది అభ్యర్థులకు అవకాశం కల్పించారు. ఈ శిక్షణ కాలంలో అభ్యర్థులకు ఉచిత వసతి, భోజన సౌకర్యాలు కల్పించనున్నారు.జిఎం ఆదేశాల మేరకు ఎస్.ఓ.టు జిఎం చంద్రశేఖర్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ శ్రావణ్ కుమార్, విటిసి మేనేజర్ మాధవరెడ్డి ఈ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు, సమన్వయ బాధ్యతలను చేపట్టారు.ఈ సందర్భంగా జిఎం తెలియజేస్తూ యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించడమే మా లక్ష్యం. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మంచి భవిష్యత్తు నిర్మించుకోవాలి అని తెలిపారు.

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ కి తెలంగాణ విశ్వవిద్యాలయం నాన్ టీచింగ్ (అవుట్‌సోర్సింగ్) ఉద్యోగుల విజ్ఞప్తి



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 4 జనంసాక్షి:
తెలంగాణ విశ్వవిద్యాలయంలో నాన్ టీచింగ్ (అవుట్‌సోర్సింగ్) ఉద్యోగులు బుధవారం జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ ను కలిసి వారి సమస్యలను జాతీయ ఎస్టీ కమిషన్ దృష్టికి తీసుకురావడం జరిగింది.తెలంగాణ విశ్వవిద్యాలయం లో నాన్ టీచింగ్ (అవుట్‌సోర్సింగ్) ఉద్యోగులు గత 18 సంవత్సరాల నుండి నిరంతరంగా చాలా బాధ్యతతో పనిచేస్తున్నారు.ఈ ఉద్యోగుల ద్వారా విశ్వవిద్యాలయ పరిపాలనకు ఎంతో సేవ అందిస్తున్నారు. వీరిలో దాదాపు 90 శాతం మంది ఉద్యోగులు ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందినవారు ఉన్నారు.సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించడం లేదు. గత 10 సంవత్సరాలుగా పనిచేస్తున్న వారికి రెగ్యులరైజేషన్ చేయాలని, మినిమం టైం స్కేల్ వర్తింపజేయాలని, ఈ ఎస్ ఐ, పిఎఫ్ వంటి సదుపాయాలను ప్రతి నెలా క్రమం తప్పకుండా చెల్లించాలని కోరడం జరిగింది.ఈ సమస్యల కారణంగా ఉద్యోగులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాలన్నింటినీ జాతీయ ఎస్టీ కమిషన్ దృష్టికి తీసుకెళ్లడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఉద్యోగుల తరఫున పలువురు ప్రతినిధులు బట్టు సురేష్, బికోజి శ్రీధర్, నరేష్ జాదవ్, గులాబ్, రవీందర్ నాయక్, బబ్లు, రవి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో సత్యశోధక్ విద్యార్థిని సత్తా

స్వర్ణ పతకం సాధించిన రెబ్బ హరిప్రియ

సిరికొండ, నవంబర్ 04 జనం సాక్షి:
రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో సత్యశోధక్ పాఠశాల విద్యార్థిని రెబ్బ హరిప్రియ ప్రతిభ కనబరిచి స్వర్ణ పతకాన్ని సాధించింది. అక్టోబర్ 31 నుంచి నవంబర్ 2 వరకు నిర్మల్‌లోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నిర్వహించిన 12వ తెలంగాణ రాష్ట్రస్థాయి జూనియర్ అంతర్‌జిల్లా సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ 2026?27 బాలికల విభాగంలో నిజామాబాద్ జిల్లా జట్టు ఛాంపియన్‌గా నిలిచింది. ఈ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన హరిప్రియ తన క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి జట్టు విజయంలో కీలక భాగస్వామిగా నిలిచి స్వర్ణ పతకాన్ని అందుకుంది.జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన హరిప్రియ, రాష్ట్రస్థాయిలోనూ అత్యుత్తమ ప్రదర్శనతో పాఠశాలకు, జిల్లాకు గర్వకారణంగా నిలిచింది. ఈ సందర్భంగా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు శోభన్, నవీన్, గంగామోహన్ విద్యార్థినిని అభినందించి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థిని స్వర్ణ పతకం సాధించడం పట్ల సత్యశోధక్ పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య హర్షం వ్యక్తం చేశారు. బుధవారం పాఠశాలలో హరిప్రియను ప్రత్యేకంగా అభినందించారు. ఆమె విజయానికి సహకరించిన తల్లిదండ్రులు, వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్‌లను ప్రశంసించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించేలా పాఠశాల సమాన ప్రాధాన్యతనిస్తుందని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.



డీసీఎంఎస్ ఇంచార్జి చైర్‌పర్సన్‌గా అదనపు కలెక్టర్ రాజాగౌడ్ బాధ్యతల స్వీకరణ



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 04 జనంసాక్షి:
నిజామాబాద్ జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) ఇంచార్జి చైర్‌పర్సన్‌గా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాజాగౌడ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా సంబంధిత అధికారులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. డీసీఎంఎస్ కార్యకలాపాలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, రైతులకు సహకార రంగం ద్వారా మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వారికి సూచించారు.

నీటి,విద్యుత్ వాడకం పొదుపుగా వాడాలి

ఆర్మూర్, నవంబర్ 4 (జనం సాక్షి):
ఎల్ నినో ప్రభావం రానున్న రోజుల్లో తీవ్రతరం అవుతున్న దృష్ట్యా రైతులు,ప్రజలు నీటిని పొదుపుగా వాడాలని గ్రామస్తులను ఉద్దేశించి ఆర్మూర్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి వినయ్ రెడ్డి అన్నారు. ఆలూరు మండల కేంద్రంలోని రామచంద్ర పల్లి తండాలో అభయాంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేశారు.గుత్పా తండాలో ఎర్ర కిషన్ ఆధ్వర్యంలో చౌక ధరల దుకాణ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుత్ప తండా రేషన్ షాప్ 20 ఏళ్ల ప్రారంభోత్సవ కళ నెరవేరిందని చెప్పారు. రైతులు ఆరుతడి పంటలపై దృష్టి పెట్టాలని ఈ సందర్భంగా ప్రజలను కోరారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న గుత్ప తండా సర్పంచ్ కుర్ర కిషన్,ఉప సర్పంచ్ మహేష్,గుత్ప గ్రామ సర్పంచ్ దశరథ్,శశి,మాక్లూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు దయాకర్ రావు,అడవి మామిడిపల్లి గ్రామ సర్పంచ్ లతా సాగర్,ఉపసర్పంచ్ చిరంజీవి, మున్సిపల్ చైర్పర్సన్ రఘు, ఆర్మూర్ టౌన్ కార్యకర్తలు, మహిళా నాయకులు పాల్గొన్నారు.



◆ అభయాంజనేయ స్వామి గుడి నిర్మాణానికి భూమి పూజ..
◆గుత్పతాండలో రేషన్ షాప్ ప్రారంభోత్సవం..
◆ ఆర్మూర్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి వినయ్ రెడ్డి..

ఆర్జీ-2 జీఎం కార్యాలయం ముట్టడి విజయవంతం

○23 డిమాండ్ల ఒప్పందాన్ని తక్షణమే అమలు చేయాలి : ఏఐటీయూసీ

○సమస్యలు పరిష్కరించకుంటే మరిన్ని ఆందోళనలు చేపడతాం

○కందుకూరి రాజారత్నం



యైటింక్లైన్ కాలనీ (జనంసాక్షి)నవంబర్ 4:

సింగరేణి కార్మికులతో యాజమాన్యం కుదుర్చుకున్న 23 డిమాండ్ల ఒప్పందాన్ని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాల జనరల్ మేనేజర్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆర్జీ-2 ఏరియా జీఎం కార్యాలయాన్ని ముట్టడించి యాజమాన్యానికి వినతిపత్రం అందజేశారు. ఆర్జీ-2 బ్రాంచ్ కార్యదర్శి గంధం సాంబశివరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఏఐటీయూసీ సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కందుకూరి రాజారత్నం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సింగరేణి గుర్తింపు కార్మిక సంఘంగా కార్మికుల సమస్యలను అనేకసార్లు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినప్పటికీ, ధర్నాలు, ఆందోళనలు నిర్వహించినా అనేక సమస్యలు నేటికీ పరిష్కారానికి నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో 2026 జూన్ 8న సమ్మె నోటీసు అందజేయగా, లేబర్ కమిషనర్ సమక్షంలో జరిగిన చర్చల అనంతరం ఆగస్టు 28న యాజమాన్యంతో ఒప్పందం కుదిరిందన్నారు. అయితే ఒప్పందంలో పొందుపరిచిన అనేక హామీలు ఇప్పటికీ అమలుకు నోచుకోలేదని విమర్శించారు.

ముఖ్యంగా ప్రతి నెలా మెడికల్ బోర్డులు నిర్వహిస్తామని హామీ ఇచ్చి మూడు నెలల పాటు నిర్వహించిన అనంతరం నిలిపివేయడం సరికాదన్నారు. మారుపేర్ల సమస్యపై 2022 ఏప్రిల్‌లో కుదిరిన ఒప్పందాన్ని అమలు చేయకుండా, తిరిగి ఒప్పందం చేసుకుని ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేసినప్పటికీ, కమిటీ నివేదిక పూర్తయినా సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు.

మిగిలిన అర్హులైన డిపెండెంట్ అభ్యర్థులకు నెల రోజుల్లోగా ఉద్యోగ నియామక ఉత్తర్వులు జారీ చేస్తామని హామీ ఇచ్చినా, ప్రభుత్వ స్థాయి అనుమతుల పేరుతో జాప్యం చేస్తున్నారని అన్నారు. కార్మికులకు సొంత ఇంటి పథకం అమలు చేస్తామని పలుమార్లు హామీ ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు కార్యరూపం దాల్చలేదని విమర్శించారు.

గనుల్లో కార్మికులకు అవసరమైన బూట్లు, హెల్మెట్లు, బిట్లు, డ్రిల్ రాడ్లు, ఎస్‌డీఎల్, ఎల్‌హెచ్‌డీ యంత్రాలు, హెచ్‌ఈఎంఎం యంత్రాల స్పేర్ పార్టులు, టైర్లు తదితర అత్యవసర పరికరాల కొరత తీవ్రంగా ఉందన్నారు. దీనివల్ల కార్మికుల భద్రతకు ముప్పు ఏర్పడటమే కాకుండా బొగ్గు ఉత్పత్తిపై కూడా ప్రతికూల ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. అదేవిధంగా టీబీజెన్‌కో, టీబీట్రాన్స్‌కో సంస్థల నుంచి సింగరేణికి రావాల్సిన సుమారు రూ.59 వేల కోట్ల బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పించాలని డిమాండ్ చేశారు.

ఏఐటీయూసీ ప్రధాన డిమాండ్లు ఇవే..

ప్రతి నెలా మెడికల్ బోర్డులు నిర్వహించి అర్హులైన కార్మికులకు నిబంధనల ప్రకారం తగిన ఉద్యోగాలు కల్పించాలి.

మారుపేర్ల సమస్యలో పెండింగ్‌లో ఉన్న అర్హులైన అభ్యర్థులందరికీ, ముఖ్యంగా 35 నుంచి 40 సంవత్సరాల వయస్సు గల వారికి ఉద్యోగాలు కల్పించాలి.

మిగిలిన అర్హులైన డిపెండెంట్ అభ్యర్థులకు తక్షణమే నియామక ఉత్తర్వులు జారీ చేయాలి.

అర్హులైన కార్మికులందరికీ సొంత ఇంటి పథకాన్ని అమలు చేయాలి.

కార్మికుల భద్రతకు అవసరమైన రక్షణ పరికరాలు, యంత్రాలు, స్పేర్ పార్టులు తక్షణమే సరఫరా చేయాలి.

టీబీజెన్‌కో, టీబీట్రాన్స్‌కో సంస్థల నుంచి సింగరేణికి రావాల్సిన సుమారు రూ.59 వేల కోట్ల బకాయిలను ప్రభుత్వం ఇప్పించాలి.

ఈ డిమాండ్లతో పాటు గతంలో యాజమాన్యం కార్మిక సంఘాలతో కుదుర్చుకున్న ఒప్పందాలు, ఇచ్చిన హామీలన్నింటినీ వెంటనే అమలు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. సింగరేణి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వ్యక్తిగతంగా జోక్యం చేసుకుని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం మరిన్ని ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో బ్రాంచ్ సహాయ కార్యదర్శులు శ్యాంసన్, ఆవుల రవికుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శులు మామిడి మహేందర్, బోట్ల సంపత్, పిట్ కార్యదర్శులు మోటపలుకుల మహేందర్, సెగ్గం శంకర్, రోహిత్ రెడ్డి, అనిల్, కుమారస్వామి, తాళ్లపల్లి నారాయణ, వెంకటేష్, సహాయ కార్యదర్శులు అల్లి రమేష్, సాదరి రమేష్, శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్, రాకేష్, వెంకటేష్ తదితరులతో పాటు నాయకులు సీహెచ్. కిషోర్ బాబు, కుంట తిరుపతి, లక్ష్మీనారాయణ, సీహెచ్. పోషం, సతీష్, ఈ. పోషం, రాజశేఖర్, అనిల్, లక్ష్మయ్య, పి. శ్రీనివాస్, గోవర్ధన్, కుమ్మరి శ్రీనివాస్, అగ్గు శ్రీనివాస్, బి. మల్లేష్, వహీద్, క్రాంతికుమార్, సాగే కృష్ణ, గట్టయ్య, రాజ్‌కుమార్, రాజేంద్రప్రసాద్, తుంగపల్లి రవి, రాయమల్లు, రవీందర్ తదితరులు, మైన్స్ కమిటీ, సేఫ్టీ కమిటీ సభ్యులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జ్ కేకే మహేందర్ నీ కలిసి కృతజ్ఞతలు తెలిపిన ఏఎంసి చైర్మన్ వైస్ చైర్మన్ పాలకవర్గ సభ్యులు

ముస్తాబాద్ నవంబర్ 04 (జనం సాక్షి)

వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా ఏఎంసి అవకాశం కల్పించిన సందర్భంగా కృతజ్ఞతలు తెలిపిన చైర్మన్ అరుట్ల మహేష్ రెడ్డిఈ సందర్భంగా మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన నాయకులకు ధన్యవాదాలు తెలియజేస్తూ, రైతుల సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేస్తామని వారు తెలిపారు. రైతులకు మెరుగైన సేవలు అందిస్తూ, వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలోఏఎంసీ చైర్మన్ అరుట్ల మహేష్ రెడ్డి, నామాపూర్ సర్పంచ్ మాదాసు అనిల్ ,రాజన్న సిరిసిల్ల కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి ఏళ్ల బాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గజ్జల రాజు , ఉప సర్పంచ్ సర్పంచ్ తాడేపు కొమురయ్య, తాళ్ల విజయ రెడ్డి వైస్ చైర్మన్ సడిమెల్ బాలయ్య, ఏఎంసీ డైరెక్టర్ లు గూడ సిద్ధారెడ్డి ,అన్నమేని రాజు ,గాంత రాజు, పోచమ్మల వనిత ,సద్ది మధు ,ముక్క నరసింహులు, బత్తుల నవీన్, డాకూరి మహేందర్, ఊరటి ప్రశాంత్ ,కుంభాల యాదగిరి రెడ్డి ,చేపూరి రమేష్, ఎదునూరి భాను ,పోతారం వంశీ , మెనీగని వివేక్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణ గౌడ యువజన సంఘం ఆధ్వర్యంలో సిఐకి సన్మానం



ఆర్మూర్, నవంబర్ 4(జనంసాక్షి):

ఆర్మూర్ పట్టణంలోని పట్టణ గౌడ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆర్మూర్ పట్టణ గౌడ యువజన సంఘం అధ్యక్షుడు బత్తుల శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన నూతనంగా విధుల్లో చేరిన ఆర్మూర్ సీఐ చంద్రశేఖర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి బుధవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో పట్టణ గౌడ యువజన సంఘం ఉపాధ్యక్షుడు నాగుల శివ గౌడ్, జనరల్ సెక్రటరీ ధర్పల్లి ముఖేష్ గౌడ్, సభ్యులు పాండ్యాల సచిన్ గౌడ్, ముసలి పురం వెంకటేష్ గౌడ్, ఖైరీ వెంకటేష్ గౌడ్,మెడిదల అంజి గౌడ్, అబ్బ గోని కార్తీక్ గౌడ్,ధ్యావతి మహదీప్, జంపాల నితిన్ తదితరులు పాల్గొన్నారు.



పేకాటరాయుళ్లపై పోలీసుల ఉక్కుపాదం!

భూంపల్లి శివారులో మెరుపుదాడి.. 8 మంది అరెస్ట్

రూ.13,390 నగదు, 8 సెల్‌ఫోన్లు, 6ద్విచక్ర వాహనాలు స్వాధీనం

సదాశివనగర్ నవంబర్ 4 జనంసాక్షి

అక్రమ పేకాట, జూదం కార్యకలాపాలకు పాల్పడే వారిపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఇందులో భాగంగా భూంపల్లి గ్రామ శివారులో అక్రమంగా పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడి నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకున్నారు.పోలీసులు నిర్వహించిన దాడిలో రూ.13,390 నగదుతో పాటు 8 సెల్‌ఫోన్లు, 6 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పుష్పరాజ్ తెలిపారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అక్రమ జూదం, పేకాట వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. యువత చెడు వ్యసనాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. గ్రామాలు, పట్టణాల్లో ఎక్కడైనా పేకాట లేదా ఇతర అక్రమ కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. పేకాటకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మల్లేశం కుటుంబాన్ని పరామర్శించిన చాడ వెంకట్ రెడ్డి

రాజన్న సిరిసిల్ల జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి రైతులను ఆదుకోవాలి: చాడ వెంకట్ రెడ్డి



ఇల్లంతకుంట, నవంబర్ 4 (జనంసాక్షి):

మండలంలోని తాళ్లపెల్లి గ్రామానికి చెందిన సీపీఐ సీనియర్ నాయకులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కామ్రేడ్ సావనిపెల్లి మల్లేశం ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా, బుధవారం ఆయన కుటుంబాన్ని సీపీఐ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ మల్లేశం జీవితాంతం కార్మికులు, కర్షకుల హక్కుల కోసం పోరాడిన నాయకుడని కొనియాడారు. ఆయన కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.అనంతరం మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, రాజన్న సిరిసిల్ల జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, రైతుల సమస్యలపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మిడ్ మానేరు పక్కనే ఉన్నప్పటికీ కందికట్కూర్ రైతు సావనిపెల్లి పరశురాం 15 ఎకరాల్లో సాగు చేసిన పంట నీరందక ఎండిపోయిందని పేర్కొన్నారు.అలాగే వెంకట్రావుపల్లి, గొల్లపల్లి గ్రామాల మధ్య 2018 నుంచి కొనసాగుతున్న సరిహద్దు వివాదాన్ని అధికారులు వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు గ్రామస్తులు చాడ వెంకట్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్, జిల్లా కార్యవర్గ సభ్యులు కడారి రాములు, మంద అనిల్ కుమార్, మండల కార్యదర్శి తీపిరెడ్డి తిరుపతి రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు పద్మాజివాడి విద్యార్థి విలాస్ రాథోడ్ ఎంపిక

కామారెడ్డి జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ.. స్టేట్ లెవల్‌కు అర్హత

సదాశివనగర్ నవంబర్ 4 (జనంసాక్షి)

కామారెడ్డి జిల్లాలో నిర్వహించిన 36వ సబ్‌జూనియర్ అసోసియేషన్ కబడ్డీ పోటీల్లో శ్రీ సాయి విజ్ఞాన్ హైస్కూల్, పద్మాజివాడి విద్యార్థి విలాస్ రాథోడ్ అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు.నవంబర్ 12, 13, 14 తేదీల్లో వికారాబాద్ జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో విలాస్ రాథోడ్ పాల్గొననున్నాడు. జిల్లా స్థాయిలో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ రవీందర్ రెడ్డి, ప్రిన్సిపల్ విష్ణువర్ధన్, ఉపాధ్యాయులు విద్యార్థి విలాస్ రాథోడ్‌ను అభినందించి, రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరిచి విజయం సాధించాలని ఆకాంక్షించారు.





ఎల్‌నినో' ముప్పు రానివ్వొద్దు.. తాగునీటికి ఇబ్బంది రావద్దు..

మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి నవంబర్ 4 (జనంసాక్షి)

వేములవాడ మున్సిపల్లోని విలీన గ్రామమైన శాత్రాజుపల్లి రెండో వార్డులో బుధవారం మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు కమిషనర్ లోకేష్‌లు కలిసి మౌలిక వసతుల కల్పన పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.వార్డులో సీసీ రోడ్లు, మురుగునీటి కాల్వలు (డ్రైనేజీ) పురోగతితో పాటు పారిశుధ్య పనులను పరిశీలించారు.వీధుల్లో త్రాగునీటి ఇబ్బందులు, డ్రైనేజీల నిర్వహణ, పారిశుధ్యం తీరుపై ప్రజలను, అధికారులను అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య పనుల్లో ఎలాంటి అలసత్వం వహించకూడదని, ప్రతిరోజూ చెత్త సేకరణ సక్రమంగా జరగాలని పారిశుధ్య సిబ్బందికి సూచించారు.అనంతరం మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం వల్ల రాబోయే రోజుల్లో నీటి సమస్య తలెత్తే ప్రమాదం ఉన్నందున, వార్డుల్లో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తుగా రక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఎల్ ని నో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని నీటి సరఫరా వ్యవస్థలో ఎలాంటి ఆటంకాలు రాకుండా నిరంతరం పర్యవేక్షించాలని ?అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా పారదర్శకంగా పని చేయాలన్నారు.ప్రజా సమస్యల పరిష్కారానికి, పట్టణాభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగుతున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ నరాల శేఖర్,స్థానిక కౌన్సిలర్ ఏనుగు జ్యోతి తిరుపతి రెడ్డి,సానిటరీ ఇన్స్పెక్టర్‌సుకుమార్ మున్సిపల్ వార్డ్ ఆఫీసర్ ,సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా పోటీల బహుమతులకు రూ.15 వేల ఆర్థిక సాయం

కాంగ్రెస్ రూరల్ నాయకుడు ఉమ్మాజి నరేష్

సిరికొండ, నవంబర్ 4 జనంసాక్షి:



సిరికొండ మండల కేంద్రంలో నిర్వహించనున్న మండల స్థాయి క్రీడా పోటీలకు బహుమతుల ప్రదానం కోసం కాంగ్రెస్ రూరల్ నాయకుడు ఉమ్మాజి నరేష్ తనవంతు సహాయంగా రూ. 15 వేల ఆర్థిక సాయం అందించారు. మండల స్థాయి క్రీడా పోటీలను నిర్వహిస్తున్న మోడల్ స్కూల్ నిర్వాహకులకు ఈ మొత్తాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఉమ్మాజి నరేష్ మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని అన్నారు. విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు. తద్వారా సిరికొండ మండలానికి, తమ తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని కోరారు.

మున్సిపాలిటీలో అవినీతి, అక్రమాలపై విచారణకు ఫిర్యాదు



జమ్మికుంట, నవంబర్ 4 (జనంసాక్షి): జమ్మికుంట పురపాలక సంఘంలో అవినీతి, అక్రమాలు జరుగుతున్నా యంటూ శ్రీపతి స్వర్ణలత?నరేష్ తెలంగాణ ప్రభుత్వ పురపాలక పరిపాలన సంచాలకులకు ఫిర్యాదు చేశారు.బతుకమ్మ వేడుకల సందర్భంగా వ్యాపార అనుమతి పత్రాలు లేవనే కారణంతో పారిశుద్ధ్య విభాగంలో అక్రమ వసూళ్లు జరిగినట్లు వస్తున్న ఆరోపణలు, గత ప్రత్యేక అధికారి పాలనలో చేపట్టిన కాంట్రాక్టు పనుల్లో అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు.ప్రజాధనానికి జవాబుదారీతనం ఉండాలని, ఆరోపణలపై పారదర్శకంగా విచారణ చేపట్టి బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని వారు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు.



ఇల్లంతకుంటలో అభివృద్ధి పనులపై సర్పంచ్ క్షేత్రస్థాయి పరిశీలన

ఇల్లంతకుంట,నవంబర్ 04(జనంసాక్షి)

ఇల్లంతకుంట మండల కేంద్రంలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులపై సర్పంచ్మామిడి రాజు బుధవారం సంబంధిత అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు.ఈ సందర్భంగా బతుకమ్మ ఘాట్ సుందరీకరణ, చెక్‌డ్యామ్ నిర్మాణం, దోబీ ఘాట్ వద్ద రైతుల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా కల్వర్టు నిర్మాణానికి అవసరమైన స్థలాలను పరిశీలించారు. ఆయా పనుల ద్వారా గ్రామ ప్రజలకు, రైతులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే అంశాలపై అధికారులతో చర్చించారు. అభివృద్ధి పనులకు సంబంధించి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ దిలీప్, పంచాయతీరాజ్ ఏఈ రాజేష్, వార్డు సభ్యుడు రాకం సుమన్, ఫీల్డ్ అసిస్టెంట్ వేణు, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సమస్యకు సత్వరమే పరిష్కారం

' సర్పంచ్ పల్లె మాధవి-నారాయణ యాదవ్

పెద్దపల్లి,నవంబర్ 04(జనంసాక్షి) :

గ్రామ ప్రజలకు ఏ సమస్య ఉన్న తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్న గ్రామ సర్పంచ్ పల్లె మాధవి-నారాయణ యాదవ్,కమాన్ పూర్ మండలం పెంచికల్ పేట్ 10 పదో వార్డులో నీటి సమస్య ఉందని వార్డు ప్రజలు,వార్డు సభ్యుడు పోలవేణి రాజు దృష్టికి తీసుకుపోగా తాను సర్పంచ్ కు వివరించగా వెంటనే స్పందించి బోరు మోటర్ కేబుల్ తెగిపోవడంతో అప్పటికప్పుడే కేబుల్ ఖరీదు చేసి బోర్ మోటార్ కు బిగించి వెంటనే వార్డు ప్రజలకు నీరు సరఫరా చేయడంతో వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.అలాగే కృతజ్ఞతలు తెలిపారు.

అధికారులపై ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు

పెద్దపల్లి,నవంబర్ 04(జనంసాక్షి) :

దసరా ఉత్సవాల సందర్భంగా పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణకు తగిన ప్రోటోకాల్ పాటించకుండా, అధికారిక కార్యక్రమాలకు ఆహ్వానించక పోవడంపై విచారణ జరిపించాలని ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ జిల్లా సభ్యుడు పర్స విజయ్‌కుమార్ జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను కోరారు. రామగుండం కార్పొరేషన్, పెద్దపల్లి మున్సిపల్ అధికారుల తీరుపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం కింద చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గతంలో కాళేశ్వరం పుష్కరాల సందర్భంగా ప్రోటోకాల్ ఉల్లంఘనపై కలెక్టర్ గెజిట్ ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ, మళ్లీ అదే పరిస్థితి నెలకొందని ఫిర్యాదులో పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు పత్తి క్రయవిక్రయాలు బంద్

' రైతులు నేడు పత్తిని మార్కెట్ యార్డుకు తీసుకురావద్దు

- జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి

పెద్దపల్లి,నవంబర్ 04(జనంసాక్షి) :

వాతావరణ శాఖ సూచనల మేరకు జిల్లాలో నేడు, రేపు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, అలాగే పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో నేడు రైతులు తీసుకువచ్చిన పత్తికి సంబంధించిన కాంటాలు రేపటి రోజున నిర్వహించవలసి ఉన్నందున, మార్కెట్ యార్డులోని ఆడ్తిదారులు మరియు పత్తి కొనుగోలుదారుల విజ్ఞప్తి మేరకు నేడు పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి క్రయవిక్రయాలు నిలిపివేయబడుతున్నాయి.కావున పత్తి రైతులందరూ ఈ విషయాన్ని గమనించి,పత్తిని పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డుకు తీసుకురావద్దని జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి సూచించారు.రైతులందరూ ఈ విషయాన్ని గమనించి మార్కెట్ కమిటీకి సహకరించగలరని కోరడమైనది.

రామగుండం 15వ డివిజన్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన

పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

మైటింక్లైన్ కాలనీ (జనంసాక్షి)నవంబర్ 4:

పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఇందులో భాగంగా రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 15వ డివిజన్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు.తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నాయకత్వంలో, రామగుండం ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు సూచనలతో ఈ కార్యక్రమం చేపట్టారు. 15వ డివిజన్‌కు 25 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావడం పట్ల డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బత్తిని శ్రీనివాస్ గౌడ్ మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా లబ్ధిదారురాలు చెలకాని సునీత-తిరుపతి దంపతులకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ముగ్గు పోసి శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో బత్తిని శ్రీనివాస్ గౌడ్, మాషూక్ రబ్బానీ, కనుకుట్ల రాజేష్, తంగళ్లపెల్లి సదానందం, కర్రి నవీన్, బూడిద సమ్మయ్య, అరగొండ కొమురయ్య, మామిడి శివాజీ, ఉదయ్, చెరన్, అఖిల్, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు మరింత నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలి

మోడల్ స్కూల్లో అల్పాహార పథకాన్ని పరిశీలించిన సర్పంచ్ సాంబారీ భారతమ్మ కొమురయ్య

చిగురుమామిడి నవంబర్ 04 (జనంసాక్షి):



కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలోని ముల్కనూర్ మోడల్ స్కూల్లో విద్యార్థులకు ఉదయం అల్పాహారం అందించే కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ సాంబారీ భారతమ్మ కొమురయ్య బుధవారం పరిశీలించారు.ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న అల్పాహార నాణ్యతను,అక్కడ ఉన్న వసతులను ఆమె స్వయంగా తనిఖీ చేసి, సంతృప్తి వ్యక్తపరిచారు. అనంతరం సర్పంచ్ సాంబారీ భారతమ్మ మాట్లాడుతూ చిగురుమామిడి మండలాన్ని పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి విద్యార్థులకు ఉదయం అల్పాహారం అందించే మంచి కార్యక్ర కమానికి శ్రీకారం చుట్టడం అభినందనీ యమన్నారు. ఈ పథకం ద్వారా పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని ఆమె పేర్కొన్నారు. ఉదయం పూట నాణ్యమైన అల్పాహారం తీసుకోవడం వల్ల విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటారని, తద్వారా చదువుపై మరింత ఏకాగ్రత చూపించే అవకాశం ఉంటుందని ఆమె అభిప్రాయపడ్డారు. పాఠశాలల్లో విద్యార్థులకు నిరంతరం మరింత నాణ్యమైన పౌష్టికాహారం అందేలా అధికారులు, సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు.ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ హర్జిత్ కౌర్, ఉప సర్పంచ్ పైడిపల్లి వెంకటేష్, పాఠశాల సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.